


ఆంధ్రజ్యోతి





'సోమశిల'కు 14,105 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి మంగళవారం 14,105 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగింది. దీంతో డ్యాం నీటి మట్టం 36.230 టీఎంసీలకు చేరుకొంది. ఉత్తర కాలువకు 370, వరద కాలువకు 4,000, డెల్టాకు 3,600 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.



రికవ(రీ!

- ఎస్సీ కార్పొరేషన్‌లో వసూలుకాని బకాయిలు
- సుమారు రూ.28 కోట్లకుపైమాటే
- పదేళ్లు గడుస్తున్నా అధికారుల్లో కానరాని చలనం

షెడ్యూలు కులాలకు చెందిన యువతకు (ఎస్సీ) ఉపాధి కల్పించడమే లక్ష్యంగా 2014-19 మధ్య కాలంలో అప్పటి తెలుగు దేశం ప్రభుత్వం వాహనాలు, వాణిజ్య దుకాణాల ఏర్పాటుకు రుణాలు అందజేసింది. ఇందుకు 35 నుంచి 50 శాతం వరకు సబ్సిడీ కూడా ఇచ్చింది. కానీ నెలలు, సంవత్సరాలు గడుస్తున్నా రుణ రికవరీ మాత్రం కావడం లేదు. ఇప్పటివరకు సుమారు 28.66 కోట్ల రూపాయలు వసూలు కావాల్సి ఉంది. ఇంత భారీ మొత్తంలో బకాయిలు ఉన్నా ఎస్సీ కార్పొరేషన్ అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేదు. అంతేగాక వారు వ్యవహరిస్తున్న తీరు కూడా విమర్శలకు తావిస్తోంది.

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే మరికొంత మంది లబ్ధిదారులకు కొత్త రుణాలు ఇవ్వొచ్చు. వారి ఎదుగుదలకు కూడా ఊతం ఇచ్చినట్టు అవుతుంది. కానీ, ఎస్సీ కార్పొరేషన్‌లో మాత్రం ఇందుకు విరుద్ధంగా జరుగుతోంది. 2014-19 మధ్య తెలుగుదేశం పార్టీ హయాంలో మంజూరు చేసిన సబ్సిడీ రుణాలను రికవరీ చేయటంలో అధికారులు కాలయాపన చేస్తున్నారు. ఎస్సీలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి గతంలో టీడీపీ ప్రభుత్వం విరివిగా సబ్సిడీ రుణాలను మంజూరు చేసింది. వివిధ రంగాల్లో అనుభవం ఉన్నవారికి వారు కోరుకున్న యూనిట్లను మంజూరు చేసింది. ఇందులో లబ్ధిదారు మహిళ అయితే 50 శాతం, పురుషుడైతే 35 శాతం రాయితీ ఇచ్చారు. కానీ తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించడంలో జాప్యం చేస్తున్నారు.



- తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 2015-16 నుంచి 2018-19 ఆర్థిక సంవత్సరాల మధ్య ఎన్‌ఎస్‌ఎఫ్‌డీసీ (ట్రాన్స్‌పోర్టు) పథకం కింద 79 మందికి రూ.9.16 కోట్ల విలువైన ఇన్నోవా కార్లను, మరో 70 మందికి రూ.3.84 కోట్ల విలువైన ఎతియాస్ కార్లను అందజేసింది. అదే విధంగా ఇతర వాహనాల కింద ఒక జేసీబీకి రూ.30లక్షలు, ఈ-ఆటోలు తదితర 39 వాహనాలకు రూ.2.21 కోట్లను రుణాలుగా అందచేసింది. ఎన్‌ఎస్‌ఎఫ్‌డీసీ (నాన్ ట్రాన్స్‌పోర్టు-సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంటు) కింద ఇటుకల తయారీ, మినీ డెయిరీ, కిరాణా షాపులు తదితరాలు పెట్టుకోవడానికి 615 మందికి రూ.10.44 కోట్లు రుణాలుగా అందచేసింది. భూమి కొనుగోలు పథకం కింద 118 మంది లబ్ధిదారులకు రూ.2.55 కోట్ల సబ్సిడీ రుణాలను అప్పట్లో అఅఇకారులు పంపిణీ చేశారు. ఇలా ఎన్‌ఎస్‌ఎఫ్‌డీసీ కింద మొత్తం 921 యూనిట్లకు రూ.28.22 కోట్లను సబ్సిడీ రుణాలుగా అందచేసింది. ఈ రుణాలకు సంబంధించి ఇప్పటివరకు లబ్ధిదారుల నుంచి రూ. 5.33 కోట్లను మాత్రమే ఎస్సీ కార్పొరేషన్ అధికారులు రాబట్టగలిగారు. ఇంకా రూ.22.88 కోట్లు రికవరీ చేయాల్సి ఉంది.
- అదేవిధంగా ఎన్‌ఎస్‌కేఎఫ్‌డీసీ (ట్రాన్స్‌పోర్టు) పథకం కింద రెండు ఇన్నోవా కార్లకు రూ.24.9 లక్షలు, ఒక ఎతియాస్ కారుకు రూ.6.12 లక్షలు, 14 ట్రాక్టర్లు-ట్రాలీలకు రూ. 69.2 లక్షలు, 99 ఈ-ఆటోలకు రూ.84.11 లక్షలు, 18 ఎండీసీఎంఎస్‌లకు రూ. 1.97 కోట్లు రుణాలుగా అందచేశారు. ఎన్‌ఎస్‌కేఎఫ్‌డీసీ (నాన్-ట్రాన్స్‌పోర్టు-సెల్ఫ్ ఎంప్లాయిమెంటు) పథకం కింద 256 మందికి రూ.2.33 కోట్లు రుణాలుగా ఇచ్చారు. ఈ పథకం కింద మొత్తం 390 యూనిట్లకు గాను రూ.6.15 కోట్లు అందచేశారు. ఈ మొత్తంలో కేవలం రూ.36.99 లక్షలను మాత్రమే రాబట్ట గలిగారు. ఇంకా రూ.5.78 కోట్లు రికవరీ చేయాల్సి ఉంది. మొత్తంగా ఎన్‌ఎస్‌ఎఫ్‌డీసీ, ఎన్‌ఎస్‌కేఎఫ్‌డీసీ పథకాల కింద ఇంకా రూ. 28.66 కోట్లను లబ్ధిదారుల నుంచి రాబట్టాల్సి ఉంది.

ఉద్యోగుల ష్యూరిటీ ఉన్నా...

ఇన్నోవా, ఎతియాస్, జేసీబీ వాహనాలను తీసుకునే సమయంలో లబ్ధిదారులకు కొందరు ప్రభుత్వ ఉద్యోగులు ష్యూరిటీ ఇచ్చారు. మరి కొందరు తమ ఇంటి, భూముల పత్రాలను ష్యూరిటీ కింద ఎస్సీ కార్పొరేషన్ అధికారులకు అందజేశారు. ఇంత ఉన్నా రుణాలు తిరిగి చెల్లించని లబ్ధిదారులకు నోటీసులు ఇవ్వకపోవడంపై ఎస్సీ కార్పొరేషన్ అధికారుల మెతకవైఖరి ఏమిటో అంతు పట్టడం లేదు.



నోటీసులు ఇస్తున్నాం

2015-16 నుంచి 2019 వరకు కార్లు, జేసీబీలు తదితరాలు తీసుకున్న లబ్ధిదారులు రుణానికి సంబంధించి నెలవారీ చెల్లింపులు చేయటం లేదు. వారికి ష్యూరిటీ ఇచ్చిన ఉద్యోగుల జీతాల నుంచి రికవరీ చేస్తామని చెబుతున్నాం. చివరి ప్రయత్నంగా లబ్ధిదారులకు నోటీసులు ఇస్తున్నాం. అయినా వారు స్పందించకపోతే ఆర్‌ఆర్ యాక్ట్‌ను ప్రయోగించి రుణాలు రికవరీ చేస్తాం. రుణాలు తీసుకున్న వారు సకాలంలో చెల్లిస్తే మరికొంత మంది కొత్త వారికి రుణాలు అందచేసే అవకాశం ఉంటుంది.

- ఈ. కిరణ్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఎస్సీ కార్పొరేషన్

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్న ప్రభుత్వం తాజాగా దూర ప్రాంతాల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు రవాణాభత్యం ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంది.

విద్యార్థులకు రవాణా భత్యం

- 10,396 మంది... రూ.62.37 లక్షలు
- ఒక్కొక్కరికి నెలకు రూ.600 చెల్లింపు
- త్వరలో తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ

నెల్లూరు(విద్య), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థుల నివాసం కిలోమీటరు కంటే ఎక్కువ దూరం ఉన్న 1 నుంచి 5వ తరగతి పిల్లలు, 3 కి.మీ కంటే ఎక్కువ దూరంలో ఉన్న 6, 7, 8 తరగతుల విద్యార్థులకు రవాణా భత్యం ఇచ్చేలా జాబితాను సిద్ధం చేశారు. గతంలో ఇదే నగదును ఏడాదికి ఒకసారి చెల్లిస్తున్న తరుణంలో విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న ఫిర్యాదులతో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలలకు ఒకసారి నగదు చెల్లించాలని నిర్ణయం తీసుకుంది. పాఠశాలలు దూరంగా ఉన్నచోట పిల్లలు అత్యధికంగా ఆటోల్లో ప్రయాణించడం, మరికొంత మందిని వారి తల్లిదండ్రులు తమ వాహనాల్లో విడిచిపెట్టడం చేస్తున్నా వీటికి అయ్యే ఖర్చులు భారంగా ఉండటంతోపాటు ప్రమాదాల భయం కూడా వెంటాడుతోంది. ఈ సమస్యలకు పరిష్కారంగా విద్యార్థులు సురక్షితంగా పాఠశాలలకు చేరుకోవాలన్న ఉద్దేశంతో రవాణా భత్యం అందించనున్నారు.



జిల్లాలో 10,396 మంది విద్యార్థులు

జిల్లాలో ఇప్పటివరకు చేపట్టిన సర్వే ప్రకారం 404 ప్రభుత్వ పాఠశాలల్లో 10,396 మంది విద్యార్థులను అధికారులు గుర్తించారు. వీరిలో ఒక్కో విద్యార్థికి నెలకు రూ.600 చొప్పున మూడు నెలలకు రూ.1800 చెల్లించనున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య తెలిపారు. మొత్తం 10,396 మంది విద్యార్థులకు రూ.62,37,600 నగదు విడుదల కానుందని, ఈ నగదుకు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. అలాగే జరిగిన సర్వేను కూడా మరోసారి స్పష్టంగా చేయాలని ఆదేశాలిచ్చామని, దీనివల్ల విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.



ఉదయగిరి - నందవరం రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు

రోడ్ల మరమ్మతులకు నిధులు

- మూడు కీలక రహదారులకు రూ.14.5 కోట్లు
- రోడ్ల మెయింటెనెన్స్‌కు మరో రూ.4 కోట్లు
- టెండర్లు ఆహ్వానించిన ఆర్అండ్‌బీ శాఖ

నెల్లూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కీలకమైన రహదారుల అభివృద్ధికి అడుగులు ముందుకుపడ్డాయి. మూడు ప్రధాన కనెక్టివిటీ రోడ్లను బాగు చేసేందుకు రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ (ఏపీఆర్‌డీసీ) ద్వారా నిధులు మంజూరయ్యాయి. మొత్తం మూడు రోడ్లకు కలిపి రూ.14.50 కోట్లు ఇచ్చారు. మనుబోలు - పొదలకూరు రోడ్డు, ఉదయగిరి - నందవరం రోడ్డు, సంగం-విరువూరు-కలువాయి రోడ్డు ఈ జాబితాలో ఉన్నాయి. మనుబోలు-పొదలకూరు రోడ్డుకు సంబంధించి సున్నా నుంచి పదో కిలోమీటర్ వరకూ బాగు చేసేందుకు రూ.3.50 కోట్లు, ఉదయగిరి - నందవరం రోడ్డుకు 16 నుంచి 29వ కిలోమీటర్ మధ్య బాగు చేసేందుకు రూ.2.50 కోట్లు, సంగం-విరువూరు-కలువాయి రోడ్డుకు సంబంధించి 26 నుంచి 46 కిలోమీటర్ల మధ్య ఇంప్రూమెంట్ చేసేందుకు రూ.8.5 కోట్లు మంజూరు చేశారు. మొత్తంగా 42 కిలోమీటర్ల మేర ఈ రహదారులను అభివృద్ధి చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఆర్అండ్‌బీ అధికారులు టెండర్లు ఆహ్వానించారు. ఈ 18వ తేదీతో టెండర్ల గడువు ముగుస్తుండగా, ఆ తర్వాత పనులు ప్రారంభం కానున్నాయి. కాగా కొన్ని ప్రధాన రోడ్ల మెయింటెనెన్స్ కూడా ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఆర్అండ్‌బీ శాఖ నెల్లూరు, కావలి డివిజన్ల పరిధిలో మెయింటెనెన్స్‌కు రూ.4 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులను సెక్షన్ల వారీగా మొత్తం 29 ప్యాకేజీలుగా విభజించి అధికారులు టెండర్లు పిలిచారు.

పోలీసు నిఘాలో వరికుంటపాడు

- నివాసాల్లోనే ఆందోళనకారులు

6లో..

చూసి కొనండి సార్!

పొగాకు రైతుల వేడుకోలు • నాణ్యత లేదనే సాకుతో బేళ్లు వెనక్కు..

- వివరాలు 8లో..

రేపటి నుంచి క్రీడాపోటీలు

- డీఎస్‌డీవో యతిరాజ్

నెల్లూరు(విద్య), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఈ నెల 29న నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో క్రీడా పోటీలు నిర్వహించ నున్నట్లు డీఎస్‌డీవో ఆర్‌కే యతిరాజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తొలుత జిల్లాస్థాయిలో గురువారం అథ్లెటిక్స్, ఆర్చరీ, బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, కబడ్డీ, 8వతేదీన బాస్కెట్‌బాల్, హాకీ, ఖోఖో, వాలీబాల్, 9వతేదీన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయని తెలిపారు. 22 ఏళ్లలోపు వయసు కలిగిన క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రాలు, టెన్త్ మార్కుల జాబితా, ఆధార్‌కార్డును సమర్పించి పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు సంబంధిత తేదీల్లో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఉదయం 7 గంటలకు హాజరు కావాలని కోరారు. జిల్లా స్థాయిలో రాణించిన వారితో జట్లను ఎంపిక చేస్తామని, వారికి ఈనెల 11 నుంచి 14వతేదీ వరకు గుంటూరులో జోనల్‌స్థాయి క్రీడాపోటీలు జరుగుతాయని తెలిపారు. జోనల్‌లో ప్రథమ స్థానం సాధించిన క్రీడా జట్లు ఈనెల 16 నుంచి 20వతేదీ వరకు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. జోనల్, రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు శాప్ పూర్తి ఖర్చులు భరించి పోటీలకు పంపిస్తుందని వివరించారు.

'కామరాజ్' కుటుంబానికి


రూ.1.29 కోట్లు!

- పరిహారాన్ని డిపాజిట్ చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల
- హైకోర్టు ఆదేశాలతో ప్రభుత్వం నిర్ణయం
- ప్రమాదానికి కాంట్రాక్టరే బాధ్యుడని ఇంజనీర్ల నివేదిక
- కాంట్రాక్టర్ నుంచి రికవరీ చేసేందుకు సిఫార్సు
- 2016లో రోడ్డు ప్రమాదంలో మరణించిన టీచర్ కామరాజ్

నెల్లూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు ఆర్అండ్‌బీ అధికారులు దిగొచ్చారు. రోడ్డు ప్రమాదంలో టీచర్ కామరాజ్ మరణించిన కేసులో కోర్టు ఆదేశాలను అమలు చేసేందుకు ఉపక్రమించారు. ఎన్నో మలుపులు తిరిగిన ఈ పరిహారం కేసు ఇప్పుడు కీలక దశకు చేరుకుంది. కామరాజ్ కుటుంబానికి రూ.1.29 కోట్లు పరిహారంగా ఇవ్వాలని జిల్లా కోర్టు తీర్పు ఇవ్వగా దీనిపై ప్రభుత్వం హైకోర్టులో అప్పీల్ వేసింది. అయితే జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పులోని 50 శాతం పరిహారం మొత్తాన్ని డిపాజిట్ చేస్తే తదుపరి వాదనలు వింటామని హైకోర్టు స్పష్టం చేసింది. ఎనిమిది వారాల్లోపు ఈ మొత్తాన్ని జమ చేయాలని ఈ ఏడాది జనవరిలో ఆదేశించినా ఆర్అండ్‌బీ శాఖ జమ చేయలేదు. ఈలోపు జిల్లా కలెక్టరేట్ ఆస్తులను అటాచ్‌మెంట్‌కు కోర్టు ఆదేశాలివ్వడంతో ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులు దిద్దుబాటు చర్యలకు పూనుకున్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు రూ.1.29 కోట్ల పరిహారంలో 50 శాతాన్ని నెల్లూరు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ వద్ద డిపాజిట్ చేస్తూ తాజాగా జీవో విడుదల చేశారు. అదే సమయంలో కోర్టు తీర్పుల నేపథ్యంలో ఆర్అండ్‌బీ శాఖలో తీవ్ర చర్చే జరిగింది. అనేక విచారణలు జరిగాయి. వర్కు అగ్రిమెంట్ ప్రకారం వర్కు జరుగుతున్న సమయం లో ఎటువంటి నష్టం జరిగినా అందుకు కాంట్రాక్టరే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని ఇంజనీర్లు స్పష్టం చేశారు. పరిహారం అమౌంట్‌ను కాంట్రాక్టర్ నుంచే రికవరీ చేయాలం టూ ఇంజనీర్లు ప్రభుత్వానికి నివేదించారు.

ఇదీ నేపథ్యం..

2016, మే 27వ తేదీన రామతీర్థం పాఠశాలలో పీఈటీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న దాసరి కామరాజ్ రాత్రి 11 గంటల ప్రాంతంలో నెల్లూరు నుంచి బైక్‌పై తిరిగి స్వగ్రామమైన విడవలూరు మండలం వావిళ్లకు వెళుతున్నారు. కొడవలూరు మండలం గుండాలమ్మపాలెం వద్ద ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం గుంతలు తీశారు. ఈ గుంతలను గమనించలేకపోయిన కామరాజ్ బైక్‌పై అక్కడ ప్రమాదానికి గురై మరణించారు. దీనిపై కొడవలూరు పోలీసు స్టేషన్‌లో 42/2016 క్రైం నంబర్‌తో కేసు నమోదైంది. కాగా కామరాజ్ కుటుంబం మొత్తం ఆయన జీతంపైనే ఆధారపడి జీవిస్తోంది. దీంతో వీరంతా పరిహారం కోసం జిల్లా కోర్టును ఆశ్రయించారు. కాంట్రాక్టర్లయిన పైడాల తిరుపతిరెడ్డి, యేగు పెంచలయ్య, ఆర్అండ్‌బీ ఎస్ఈ, ఈఈ, ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజనీర్లను పార్టీలుగా చేరుస్తూ సూట్ వేశారు. కామరాజ్ ఉపాధ్యాయుడని, ఆయనకు ఇంకా 12 సంవత్సరాల సర్వీసు ఉందని, ఆయన జీతం, బెనిఫిట్స్ మొత్తం లెక్కించి రూ.90 లక్షలు పరిహారంగా ఇప్పించాలని కోర్టును అభ్యర్థించారు. మూడో జిల్లా అదనపు న్యాయస్థానంలో ఐదేళ్ల పాటు విచారణ జరిగిన ఈ కేసులో కామరాజ్ కుటుంబ సభ్యులకు అనుకూలంగా తీర్పు వచ్చింది. రూ.81.25 లక్షలను బాధిత కుటుంబానికి పరిహారం కింద వడ్డీతో సహా చెల్లించాల్సిందిగా ఆర్అండ్‌బీ అధికారులను కోర్టు ఆదేశించింది. వడ్డీ మొత్తాన్ని లెక్కించగా రూ.1.29 కోట్లుగా తేలింది.



సమస్యల తంటా...

అంగన్‌వాడీల పోరుబాట!

- వేతనం పెంచి, కొత్త ట్యాబ్‌లు ఇవ్వాలని డిమాండ్
- సీడీపీవో కార్యాలయాలకు పాత సెల్‌ఫోన్లు



నెల్లూరు : మూటకట్టిన సెల్‌ఫోన్లు



ఉదయగిరిలో సెల్‌ఫోన్లను చేతబట్టుకుని ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను నేర్పుతూ బాలింతలకు, గర్భిణులకు పోషకాహారాన్ని అందించే అంగన్‌వాడీలు పోరుబాట పట్టారు. వేతనాలు పెంచకుండా, అనేక యాప్‌లను ప్రవేశపెట్టి మొరాయిస్తున్న సెల్‌ఫోన్ల ద్వారా అధికారులు ఒత్తిడి తేవటంతో తిరగబడ్డారు. ఈ సమస్యలపై పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడంతో ప్రత్యక్ష పోరాటానికి దిగారు. తమ వద్ద నున్న ఫోన్లను గుట్టలుగా పోసి, వాటిని మూటగట్టి సీడీపీఓలకు ఇవ్వబోగా వారు నిరాకరించారు. దీంతో వాటిని సీడీపీవోల కార్యాలయాల్లో ఉంచి ఫొటోలు తీసుకుని వచ్చారు.

యాప్‌లతో పనిభారం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోషణ ట్రాకర్ యాప్, బాల సంజీవని యాప్‌లను ప్రవేశపెట్టాయి. ముఖ హాజరు ద్వారా సరుకుల పంపిణీకి శ్రీకారం చుట్టాయి. ఈ యాప్‌ల వినియోగానికి సంబంధించి అంగన్‌వాడీలకు కనీసం శిక్షణ కూడా ఇవ్వలేదు. ఫోన్లనూ సరఫరా చేయలేదు. పోషణ కిట్‌లను పంపిణీ చేయడానికి ఆధార్‌లో పేర్కొన్న ఫోన్ నెంబరుకు ఓటీపీ వస్తుంది. చాలా మంది గర్భిణులు, బాలింతలు ఆధార్‌లో ఒక నంబరు ఇచ్చి, మరో నంబరును ఫోనుగా వినియోగిస్తున్నారు. ఓటీపీ చెబితేనే వారికి సరుకులు ఇవ్వాల్సిన పరిస్థితి ఉంది. అధికారుల అధికారుల ఒత్తిళ్లతోపాటు లబ్ధిదారులు సరుకుల కోసం వచ్చినప్పుడు ఫోన్లు పనిచేయక పోవటం, నెట్ సిగ్నల్ లేకపోవటం, సర్వర్లు పనిచేయకపోవటంతో వారు విసిగిపోతున్నారు.

జీతాలు పెంచి...
కొత్త ట్యాబ్‌లు ఇవ్వాలి

తమకు పక్క రాష్ట్రం తెలంగాణలో ఇస్తున్నట్లు రూ. 18వేల వేతనాన్ని ఇవ్వాలని అంగన్‌వాడీలు కోరుతున్నారు. కొత్తగా జీబీ ఎక్కువగా ఉండే ట్యాబ్‌లను పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ట్యాబ్‌లు తిరిగి తీసుకోం

జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్లు తమ వద్ద వున్న ట్యాబ్‌లను సీడీపీఓ కార్యాలయాలకు చేర్చారు. వారు తీసుకోకపోవటంతో ఆ కార్యాలయ గదుల్లో ఉంచి ఫొటోలు తీసుకుని వచ్చాం. వేతనం రూ.18 వేలకు పెంచి, కొత్త ట్యాబ్‌లు ఇవ్వాలి.

- సుజాత, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రాపూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని రాపూరు, సైదాపురం, కలువాయి మండలాలకు సంబంధించి అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు సమగ్ర శిశు సంక్షేమ అధికారిణి సునంద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26లోగా, ఒక అంగన్‌వాడీ కార్యకర్త, ఏడు హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు మండలాల పరిధిలోని గల సీడీపీవో, ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9633
వెండి కిలో ధర	రూ. 115800
వెండి ఒక గ్రాము	రూ. 118.80

'జలం' మాయం..చర్యలు శూన్యం!


కనుపూరు చెరువులో నీళ్లు వదలేయడంతో తగ్గిన నీటిమట్టం


చెరువు తూముల నుంచి దిగువకు వెళ్తున్న నీళ్లు

- కనుపూరు చెరువులో చేపల కోసం నీటి తొలగింపు
- జలవనరుల శాఖాధికారుల నిర్లక్ష్యం
- చేపల సొసైటీ నిర్వాహకుల స్వార్థం
- మూడు నెలల వ్యవధిలో సగం చెరువు ఖాళీ
- మరో 15 రోజులు గడిస్తే తీవ్ర నీటి ఎద్దడి!
- ఈ క'న్నీటి' పాపం... ఇరిగేషన్ అధికారులదే..!

వెంకటాచలం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : కనుపూరు చెరువును చూస్తే.. ఎవరికైనా హృదయం తడారిపోతుంది. జలవనరుల శాఖాధికారుల నిర్లక్ష్యం.. చేపల సొసైటీ నిర్వాహకుల స్వార్థం.. ఐదారు గ్రామాల ప్రజలకు శాపంగా మారింది. ఎండాకాలం తీవ్రత ఇంకా తగ్గనేలేదు. భూగర్భజలాలు అడుగంటుతున్న తరుణంలో చెరువు నీటిని వృథాగా విడిచిపెట్టడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కనుపూరు చెరువులో చేపలు పట్టుకునేందుకు కొంతమంది చేపల సొసైటీ నిర్వాహకులు అనధికారికంగా తూముల గుండా నీటిని దిగువకు వదిలేస్తున్నారు. కొంతమంది రాజకీయ నాయకుల అండతో చెరువు నీళ్లను ఖాళీ చేసేందుకు కుట్రలు చేస్తున్నా జలవనరులశాఖాధికారులు, సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజల క'న్నీటి' గోడు పట్టించుకునే నాథుడే లేడు. మండలస్థాయి అధికారులకు ఫోన్ల ద్వారా పలువురు గ్రామస్థులు మొరపెట్టుకున్నా ఫలితం కూడా లేకుండాపోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నీటి ఎద్దడి పాపం.. ఇరిగేషన్ అధికారులు, సిబ్బందేనని పరిసర గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● చెరువు నీళ్లు వృథా.. పల్లెల్లో కన్నీటి వ్యథ..

మండలంలోని అన్ని చెరువుల కన్నా కనుపూరు చెరువే అతిపెద్దది. మూడు గ్రామాలను కలిపేలా దీని విస్తీర్ణం ఉంటుంది. చుట్టుపక్కల సుమారు అయిదారు గ్రామాల ప్రజలకు ఈ చెరువు నీళ్లే ఆధారం. అంతటి ప్రాధాన్యత ఉన్న ఈ చెరువు నీటిని వ్యవసాయ పంటలకు ఉపయోగించాల్సింది పోయి.. వృథాగా బయటికి వదిలేయడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువుకు సంబంధించిన కొందరు చేపల సొసైటీ నిర్వాహకులు ఎలాంటి అనుమతులూ లేకుండా చెరువు తూములు తెరిచి నీటిని దిగువకు వృథాగా వదిలేస్తున్నా పట్టించుకునేవారు లేరు. కనుపూరు చెరువులో నీళ్లు ఖాళీ అయితే ఆ ప్రభావం వెంకటాచలం, కనుపూరు, ఎర్రగుంట, కందలపాడు తదితర గ్రామాలపై పడుతుంది. ఇప్పటికే ఆయా గ్రామాల పరిధిలో భూగర్భజలాలు అడుగంటిపోయాయని ప్రజలు అంటున్నారు. మూడు నెలల వ్యవధిలోనే 50 శాతానికిపైగా నీళ్లు వృథాగా బయటకు విడిచిపెట్టేశారని, కొందరు నేతల అండదండలతోనే చెరువులో నీటిని వదిలిపెట్టేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.

కనుపూరు చెరువులో నుంచి అక్రమంగా నీటిని వదులుతున్నారని పలువురు గ్రామస్థులు ఇరిగేషన్ అధికారులు, సిబ్బందికి ఫిర్యాదు చేసినా కనీస స్పందన లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఇలానే అప్పటి సొసైటీ నిర్వాహకుడు ఇరిగేషన్ అధికారులు, సిబ్బందితో కలిసి కుమ్మక్కై, చెరువులో నీళ్లు విడిచిపెట్టేయడంతో ఆయా గ్రామాల్లో తీవ్ర కొరతగా నీటి సమస్య ఏర్పడింది. అప్పట్లో గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయి దాదాపు బావులన్నీ పూర్తిగా ఎండిపోయాయి. ఆ ప్రభావం వెంకటాచలంలో రెండేళ్ల పాటు కనిపించింది. దీంతో అప్పట్లో ట్రాక్టర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు. ఆ పరిస్థితి మళ్లీ ఇప్పుడు అదే పరిస్థితి దాపురించింది.

●మూడు నెలల కిందటే 'ఆంధ్రజ్యోతి' హెచ్చరించినా..

గత మూడు నెలల కిందట 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో కనుపూరు చెరువులో చేపల వేట కోసం నీటిని తొలగిస్తున్నారని కథనం ప్రచురితమైంది. అప్పట్లో ఇరిగేషన్ అధికారులు కేవలం దిద్దుబాటు చర్యలు చేపట్టారే కానీ నీటి కొరత ఏర్పడకుండా కనీసం ముందస్తు జాగ్రత్తలు మాత్రం తీసుకోలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అప్పుడు ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది పట్టించుకుని ఉంటే నేడు కనుపూరు చెరువులో సగానికిపైగా నీళ్ల నిల్వ ఉండేవి. కానీ ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో ఇప్పుడు కొన్ని బావులలో నీళ్ల లేక ఎండిపోగా మరికొన్ని బావులలో మాత్రం కొంత వరకు నీళ్ల ఉన్నాయి. ఆ నీళ్ల కూడా మరో 15 రోజులు ఉంటాయి. ఆ తర్వాత నీటి కష్టాలు మొదలవుతాయి. ఇప్పటికే కొందరు ప్రజలు చుట్టు పక్కల బావులు, బోర్లను ఆశ్రయిస్తున్నారు. చివరకు ట్రాక్టర్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సిన పరిస్థితి ఏర్పడేలా ఉంది.

● కనుపూరు చెరువుకు నీళ్లెందుకివ్వలేదు ?

మండల వ్యాప్తంగా ఉన్న అన్ని చెరువులకు మూడు నెలల కిందట నీరు సరఫరా చేశారు. కానీ కనుపూరు చెరువుతోపాటు మరో రెండు చెరువులకు నీళ్ల వదల లేదు. మిగతా అన్ని చెరువులలో నీళ్ల పుష్కలంగా ఉన్నాయి. మండలంలోనే పెద్దదైన కనుపూరు చెరువుకు నీళ్ల సరఫరా చేయకపోవడంపై రైతులు, ప్రజలు అసంతృప్తిగా ఉన్నారు. చెరువు నిండా నీళ్ల పుష్కలంగా ఉంటే చేపలు పట్టుకునేందుకు ఇబ్బందిగా మారుతుందని, చేపల సొసైటీ నిర్వాహకులు, ఇరిగేషన్ అధికారులు కుమ్మక్కై కనుపూరు చెరువుకు నీరు రాకుండా కుట్ర చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఎమ్మెల్యే సోమిరెడ్డి స్పందించి కనుపూరు చెరువుకు నీళ్లిచ్చి నీటి ఎద్దడి నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యత పెరగాలి

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు పెట్టే మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రామాణాలు పెంచాలని చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ వంట నిర్వాహకులకు సూచించారు. మంగళవారం చైర్‌పర్సన్ బుచ్చిలోని డీఎల్ఎన్ఆర్ ప్రభుత్వ హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్నం, కూరలు రుచిగా ఉంటున్నాయా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధన చేయాలని హెచ్ఎం, ఉపాధ్యాయులకు సూచించారు. కమిషనర్ బాలకృష్ణ, వైస్ చైర్మన్ శివకుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


మనుబోలులో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

స్మార్ట్ మీటర్లు వద్దు

● బుచ్చి, మనుబోలులో ఆందోళన

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు బిగిస్తే ప్రజలు వ్యతిరేకించాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు పులిగండ్ల శ్రీనివాసులు పిలుపు నిచ్చారు. మంగళవారం బుచ్చిరెడ్డిపాళెంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం పట్టణ కార్యదర్శి పోతంశెట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ ధర్నా నిర్వహించారు. సబ్‌స్టేషన్ ఏఈకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గండవరపు శ్రీనివాసులు, సీఐటీయూ కార్యకర్తలు పాల్గొన్నారు.

మనుబోలు: ఇళ్లకు స్మార్ట్‌మీటర్లు వద్దని మండల సీపీఎం కార్యదర్శి తలారి దేవదానం అన్నారు. మంగళవారం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఏఈ. అనీల్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. సీపీఎం నాయకులు నరసయ్య, రామయ్య, వెంకటేశ్వర్లు, లక్ష్మీ, అంకమ్మ పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ శంకుస్థాపన ఏర్పాట్ల పరిశీలన

ముత్తుకూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ముత్తుకూరులో అన్న క్యాంటీన్ నిర్మాణానికి బుధవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి శంకుస్థాపన చేస్తారని మండల టీడీపీ అధ్యక్షులు నీలం మల్లికార్జున్‌యాదవ్ తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మార్కెట్ స్థలంలో అన్న క్యాంటీన్ శంకుస్థాపనకు చేస్తున్న ఏర్పాట్లను మంగళవారం టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. కోళ్లమిట్టలో సాగరమాల రోడ్డు నిర్మాణం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులను కలిశారు. సాగర మాల రోడ్డుకు సంబంధించి చేపడుతున్న డ్రైనేజీ వల్ల తమ పొలాలకు వెళ్లేందుకు రహదారి లేక ఇబ్బందులు పడుతున్నామని కోళ్లమిట్ట రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొలిగర్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

వాట్సాప్ గుడ్ గవర్నెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రాపూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాట్సాప్ గవర్నెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం కే. చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం నుంచి బాలాజీ కాంప్లెక్స్ కూడలి వద్ద వరకు ర్యాలీ నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ ప్రజా సమస్యలపై సుమారు 700 రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి భూపతి జయమ్మ, పంచాయతీ కార్యదర్శి కవిత, ఏవో దశరథ రామయ్య, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆధార్ లింక్ చేసుకోండి

ఇందుకూరుపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమరిక గ్రామంలో మంగళవారం మండల వ్యవసాయాధికారి డి.రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల భూమికి సంబంధించిన ఖాతాకు ఆధార్ లింక్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీపీఏ నరహరి, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

మనుబోలు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మూడు పంచాయతీల్లో అంగన్‌వాడీ ఆయా పోస్టులకు మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆదినారాయణమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరంపల్లి (ఎస్సీ), బద్దెవోలు (ఎస్సీ), కొమ్మలపూడి (ఎస్టీ) పంచాయతీల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాలుగా పనిచేయుటకు ఈనెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సర్వేపల్లికి జాతీయస్థాయిలో గుర్తింపు

ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి


క్రీడాకారుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి సంస్థలకు సర్వేపల్లి నియోజకవర్గాన్ని చిరునామాగా మార్చిన ఘనత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడుదేనని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కొనియాడారు. చవటపాళెం పంచాయతీ సరస్వతి నగర్ వద్ద ఉన్న అక్షర విద్యాలయంలో మంగళవారం సీబీఎస్ఈ క్లస్టర్ - 7 అథ్లెటిక్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన, జెండా వందనంతో పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఆయన కుమార్తె దీపావెంకట్ సారథ్యంలో అక్షర విద్యాలయం, స్వర్ణభారత్ ట్రస్ట్ ఒక బ్రాండ్‌గా నిలుస్తున్నాయన్నారు. వెంకయ్యనాయుడు ప్రత్యేక కృషితో ఎన్‌సీఈఆర్టీ ఈ ప్రాంతానికి తెచ్చారని, రూ.900 కోట్లతో ఈ సంస్థ ఏర్పాటు కాబోతోందన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్రరెడ్డి, అక్షర పాఠశాల డైరెక్టర్ కుముదా, ప్రిన్సిపాల్ ప్రియా జాకబ్ పాల్గొన్నారు.

వెంకటాచలం: దొడ్డరాజుపాళెంలో జరుగుతున్న గంగమ్మ తిరునాళ్లకు మంగళవారం ఎమ్మెల్యే సోమిరెడ్డి విచ్చేశారు. గంగమ్మ గుడిలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేకి తీర్థప్రసాదాలు అందజేశారు.

పదవులకు వన్నె తెచ్చిన రాజనీతిజ్ఞుడు బెజవాడ


నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ సుప్రజ

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అత్యున్నతమైన రాజకీయ పదవులను అలంకరించిన బెజవాడ గోపాల్‌రెడ్డి గొప్ప రాజనీతిజ్ఞుడని నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ కొనియాడారు. మంగళవారం బెజవాడ గోపాల్‌రెడ్డి జయంతి సందర్భంగా బుచ్చిలో ఆయన పేరుతో ఉన్న పార్కువద్దవున్న గోపాల్‌రెడ్డి విగ్రహానికి కమిషనర్ బాలకృష్ణ, కౌన్సిలర్లు, అర్బన్ అధ్యక్షుడితో కలిసి చైర్‌పర్సన్ పూలమాలవేసి నివాళులర్పించారు. పరిపాలనా దక్షత కలిగిన విలక్షణ నేత గోపాల్‌రెడ్డి బుచ్చిరెడ్డిపాళెం వాసి కావడం జిల్లాకే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శివకుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు లక్ష్మీకాంతమ్మ, సత్యనారాయణ, ప్రసాద్, కోఆప్షన్ సభ్యుడు దస్తగిరి, అర్బన్ టీడీపీ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసులు, ఎంవీ.శేషయ్య, దశరథ, హరనాథ్, ఎస్‌కే. పర్వీన్, శ్రీకాంత్‌రెడ్డి, రేబాల శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు జీలగల పంపిణీ


జీలగలు అందిస్తున్న ఏవో వెంకటకృష్ణయ్య

మనుబోలు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కొమ్మలపూడి, గురివిందపూడిలో మంగళవారం వ్యవసాయాధికారులు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో వెంకట కృష్ణయ్య రైతులకు జీలగలు పంపిణీ చేశారు. పచ్చిరొట్ట ఎరువులు సాగుకు ముందు వేసుకుంటే భూసారం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు శిరీష, ఇర్షాద్‌లు పాల్గొన్నారు.

అలఘునాథుడి ఆలయంలో కుంభాభిషేక వేడుకలు

ఆత్మకూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీదేవి,భూదేవి సమేత అలఘనాథస్వామి ఆలయంలో మూడురోజుల పాటు నిర్వహించే పుష్కర మహోత్సవ మహా కుంభాభిషేకం వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం గంగానయనం, గోపూజ, యాగశాల ప్రవేశం సాయంత్రం ప్రదోషకాల పూజ, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ప్రాతఃకాలపూజ, అష్టోత్తర శతకలశాభిషేకం, హోమం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు కే.మధుసూదనశర్మ, ఈ. నాగభూషణం, ఆలయ అర్చకులు వీ. శ్రీనివాసశర్మ, ఆలయ కమిటీ నిర్వాహకులు కేవీ శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త నిర్వహణపై శిక్షణ


అవగాహన కల్పిస్తున్న జడ్పీ సీఈవో

ముత్తుకూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : చెత్త నిర్వహణపై జిల్లా వ్యాప్త శిక్షణా శిబిరాన్ని మంగళవారం పిడతాపోలూరులోని చెత్త సేకరణ కేంద్రంలో నిర్వహించారు. జడ్పీ సీఈవో మోహన్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డిలు శిక్షణ శిబిరాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో చెత్తను సేకరించడం, తడి చెత్త పొడి చెత్తను విడదీయడం వంటి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీడీఓలు వసుమతి, రమణయ్య, ముత్తుకూరు ఎంపీడీవో నాగమణి, డిప్యూటీ ఎంపీడీవో హేమంత్‌కుమార్, కార్యదర్శి శేషగిరిరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ మండల ఉపాధ్యక్షుడు 'కనిసిరి' మృతి

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కనిసిరి శ్రీనివాసులు (పూల శ్రీనివాసులు) (53) మంగళవారం హఠాత్తుగా మృతి చెందాడు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి ఆయన మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీ నాయకులు కాసా శ్రీనివాసులు, రామిశెట్టి కళ్యాణ్, కార్యకర్తలున్నారు.

అయ్యప్ప దీక్ష పాటించండి

● శబరిమల అయ్యప్ప సేవా సమాజం జిల్లా అధ్యక్షుడు రాజా


మాట్లాడుతున్న రాజా

పొదలకూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప మాల వేసే భక్తులు 48 రోజులు దీక్ష కాలాన్ని పాటించాలని, స్వాముల భిక్షకు ఏర్పాటు చేసే అన్న దాన కేంద్రాలకు తమ వంతు సహకారం ఉంటుందని శబరిమల అయ్యప్ప సేవా సమాజం జిల్లా అధ్యక్షులు బి. రాజా అన్నారు. మంగళవారం స్థానిక జమున సినిమాస్ సెంటర్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. కేరళ రాష్ట్రంలో శబరిమల అయ్యప్ప భక్తులకు 48 రోజుల పాటు అన్నదాన కార్య క్రమాలు, వసతి ఉంటుందన్నారు. ప్రధాన ఆలయాల వద్ద అయ్యప్ప మాల ధారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్న ప్రసాద వితరణ కేంద్రా లను అయ్యప్ప భక్తులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. శబరిమల అయ్యప్ప సేవా సమాజం స్టేట్ జనరల్ సెక్రటరీ మేకల వెంకయ్య, వైస్ ప్రెసిడెంట్ చొప్పా వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షులు అడపాల మస్తాన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఓబులేసు పాల్గొన్నారు.

పురిటిబిడ్డకు తల్లిపాలే శ్రీరామరక్ష


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ఆదినారాయణమ్మ

మనుబోలు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పురిటిబిడ్డకు ప్రసవం కాగానే తల్లిపాలు పట్టించాలని, అవే ఆ బిడ్డకు శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆదినారాయణమ్మ అన్నారు. స్థానిక దళితవాడ అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఆమె మంగళవారం తల్లులను సమావేశపరిచి తల్లిపాల విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్మల, విజయ, సుజన పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

ఉదయగిరిలో రెండిళ్లలో చోరీ

● రూ.80 వేల నగదు, ఆభరణాల అపహరణ


వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ

ఉదయగిరి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అగ్రహారం వీధి, కరీమా వీధి లో రెండిళ్లలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడ్డారు. రూ. 80 వేల నగదు, బంగారం, వెండి ఆభరణాలను అపహరించుకుపోయారు. ఈ విషయం మంగళవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు, అగ్రహారంవీధికి చెందిన షేక్ అబ్దుల్‌షరీఫ్ కుటుంబ సభ్యులతో కలిసి గత శుక్రవారం అరుళ్లలో జరిగే గంధోత్సవానికి వెళ్లారు. మంగళ వారం ఇంటికి చేరుకోగా ప్రధాన ద్వారం తాళాలు ధ్వంసం చేసి ఉండటాన్ని గుర్తించారు. లోపలికి వెళ్లి పరిశీలించగా ఇంట్లో ఉన్న నాలుగు బీరువాల తాళాలు తీసి అందులో ఉన్న రూ.70 వేల నగదు, నాలుగు బంగారు గాజులు, ఐదు ఉంగరాలు, వెండి వస్తువులను చోరీ చేశారు. అలాగే కరీమావీధికి చెందిన షేక్ హుస్సేనీ కుటుంబం హైదరాబాదులో ఉంటున్నది. వారి ఇంటిలో సైతం ప్రధానద్వారం తాళాలు ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించి రూ.10 వేల నగదు, వెండి వస్తువులను అపహరించుకెళ్లారు. సమాచారాన్ని పోలీసులకు అందజేయడంతో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సిబ్బందితో వెళ్లి వివరాలు సేకరించారు. అనంతరం క్లూస్‌టీం వేలిముద్రలను సేకరించారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

● తాళాలు వేసి ఉన్న ఇళ్లే లక్ష్యం

ఉదయగిరిలో వారం రోజులుగా తాళాలు వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడుతున్నారు. ఈ చోరీలు పోలీసులకు సవాల్‌గా మారాయి. ఆయా నివాసాల్లో జరిగిన చోరీలన్నీ ఒకే మాదిరిగా ఉండడంతో పోలీసులు ఆదిశగా దర్యాప్తు చేస్తున్నారు. వరుస చోరీలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కాగా కొందరు తమ వద్ద ఉన్న బంగారు నగలు, నగదు లాకర్లలో ఉంచేందుకు బ్యాంకులకు పరుగులు తీస్తున్నారు.

ఆటో బోల్తా : దంపతులకు గాయాలు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక శీతల గిడ్డంగి సమీపంలో మంగళవారం ఆటో బోల్తా పడడంతో దంపతులు గాయపడ్డారు. సేకరించిన వివరాల మేరకు, ఏఎస్‌పేట మండలం రాజోలుకి చెందిన కొండయ్య ప్రకాశం జిల్లా కనిగిరి నుంచి ఆటోలో స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. జాతీయ రహదారిపై వెళ్తున్న ఆటో ఒక్కసారిగా అదుపు తప్పి బోల్తా పడడంతో కొండయ్య, ఆయన భార్య కల్పన గాయపడ్డారు. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఉదయ గిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

పోలీసు నిఘాలో వరికుంటపాడు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ పరిధి జంగంరెడ్డిపల్లి సమీపంలోని కొండ ప్రాంతం లో తెల్లరాయి తవ్వకాల అనుమతులను రద్దు చేయాలని కొంత కాలంగా ఐదు గ్రామాల ప్రజలు ఆందోళనలు చేస్తున్నారు. ఈ నేప థ్యంలో పోలీసులు వారిపై ఉక్కుపాదం మోపారు. దీంతో ఆందోళన కారులతో సహా ప్రజలు సైతం న్యాయబద్ధంగా చేస్తున్న పోరాటాలకు ఇన్ని ఆంక్షలా.. అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం కూడా పోలీసులు అదే పంథా కొనసాగించారు. ఆందోళనలో భాగంగా తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి తమ ఆవేదనను లిఖితపూర్వకంగా నివేదిక అందించాలనే సంకల్పంతో ఆందోళన కారులు ఉన్నారనే సమాచారంతో పోలీసులు ఉదయం నుంచి బస్టాం డ్ సెంటర్‌లో పహారా కాశారు. దీంతో ఆందోళనకారులు నివాసాలకే పరిమితమయ్యారు. గుండెపోటుకు గురైన పీరయ్య ఆరోగ్య పరిస్థితి కొంత కుదుటపడడంతో వైద్యశాలకు నుంచి ఇంటికి తరలించారు.

25 కిలోల గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ

నెల్లూరు (క్రైం), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : గంజాయి రవాణ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో ప్రత్యేక బృందం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 25 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుల వివరాలను రైల్వే డీఎస్పీ మురళీధర్ మంగళవారం ఆయన కార్యాలయంలో విలేకర్లకు వెల్లడించారు. గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే క్రమంలో జీఆర్‌పీఎస్, ఆర్‌పీఎఫ్, స్థానిక పోలీసులు, ఈగల్ టీమ్ సంయుక్తంగా ప్రత్యేక బృందంగా ఏర్పడి రైల్వే స్టేషన్లు, రైళ్లలో విస్తృత తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ నేతృత్వంలో సిబ్బంది తనిఖీలు చేస్తుం డగా అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి బ్యాగులను తనిఖీ చేయగా 25 కేజీల గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. వారిని రైల్వే పోలీసు స్టేషన్‌కు తరలించి విచా రించగా రాజస్థాన్ రాష్ట్రం జాలోర్ జిల్లాకు చెందిన భగీరథ్, రాహుల్ కుమార్‌గా చెప్పారు. ఒడిశా నుంచి రాజస్థాన్‌కు గంజాయి తరలిస్తూ రైలు మారేందుకు నెల్లూరులో దిగినట్లు తెలిపారు. రైల్వే సీఐ సుధాకర్, సంతపేట ఇన్‌స్పెక్టర్ దశరథరామయ్య పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

నెల్లూరు(క్రైం), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని జీవీఆర్ఆర్ కళాశాల ఎదురుగా ఉన్న ఖాన్ ప్రాపర్టీస్ కార్యాలయంలో ఈ నెల 2వ తేదీ చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను వేదాయపాళెం పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. స్టేషన్‌లో నిందితుల వివరాలను ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు మీడియాకు తెలిపారు. ఖాన్ ప్రాపర్టీస్ కార్యాలయంలో సుమారు రూ.1.50 లక్షల విలువ చేసే 50 గ్రాముల బంగారు నగలు, రూ.50 వేల నగదును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బాధితుల ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతిక ఆధారంగా దర్యాప్తు చేశారు. నిందితులు కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డుకు చెందిన పటాన్ అష్రఫ్ ఖాన్, మరో బాలుడని గుర్తించారు. గొలగమూడి క్రాస్ రోడ్డు వద్ద వారిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 50 గ్రాముల బంగారు నగలు, ఓ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన ఇన్‌స్పెక్టర్, ఎస్ఐలు జీ నవీన్, సాయి కల్యాణ్, సిబ్బందిని నగర డీఎస్పీ సింధుప్రియ ప్రత్యేకంగా అభినందించారు.

ఆటోలో రూ. లక్ష నగదు మాయం

నెల్లూరు(క్రైం), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఆటోలో ఓ మహిళ బ్యాగులోని నగదు మాయమైన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని హరనాథపురానికి చెందిన వరలక్ష్మీదేవికి రాజరాజేశ్వరి గుడి ప్రాంతానికి చెందిన పద్మ రూ.లక్ష నగదు ఇవ్వాల్సి ఉంది. వరలక్ష్మీదేవి గత నెల 21వ తేదీన గుడి వద్దకు వెళ్లగా పద్మ నగదు ఇచ్చింది. దానిని బ్యాగ్‌లో పెట్టుకొని ఆటోలో బయలుదేరింది. కొద్ది దూరం వెళ్లాక ఇద్దరు వ్యక్తులు అదే ఆటో ఎక్కారు. వరలక్ష్మీదేవి ఇంటికి వెళ్లిన తర్వాత బ్యాగ్‌ను తెరవగా అందులో ఉండాల్సిన నగదు కన్పించలేదు. దీనిపై బాధితురాలు మంగళవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనతో పాటు ప్రయాణించిన ఇద్దరు వ్యక్తులే నగదు చోరీ చేసి ఉంటారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	107
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	222

కోడిగుడ్ల ధర (100): 475



భక్తిశ్రద్ధలతో కాత్యాయనీ వ్రతం

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మంగళవారం సందర్భంగా రాజరాజేశ్వరి ఆలయంలో రాత్రి సామూహిక కాత్యాయనీ వ్రతం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ సందర్భంగా రాజరాజేశ్వరి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఉదయం అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. సుందరేశ్వరస్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకా లు, చండీ హోమం జరిగాయి. ఆలయ ఈవో, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

న్యూస్ బాక్స్

రక్తప్రసరణ వ్యాధులపై అవగాహన అవసరం

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : రక్తప్రసరణ వ్యాధులపై ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకోవాలని మెడికవర్ ఆసుపత్రి వాస్కులర్ సర్జన్ డాక్టర్ సుదర్శన్‌రెడ్డి ఓ ప్రకటనలో కోరారు. వేళ్లలో విపరీతమైన మంట, నిద్ర పట్టకపోవటం, వేళ్లలో పుండ్లు పడటం వంటి సమస్యలు రక్తప్రసరణ సరిగ్గా లేకపోవటం వల్ల వస్తాయని తెలిపారు. ప్రాథమిక దశలోనే గుర్తిస్తే మందులతో నయం చేయవచ్చని పేర్కొన్నారు.

నర్సింగ్ విద్యార్థిని అదృశ్యం

నెల్లూరు(క్రైం), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : నర్సింగ్ విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని బీవీనగర్‌లో ఉన్న ఓ నర్సింగ్ కళాశాల హాస్టల్ నుంచి ఈనెల 4వ తేదీ నిత్య అనే విద్యార్థిని అదృశ్యమైంది. హాస్టల్ సిబ్బంది ఆమె కోసం గాలించినా జాడ తెలియక పోవడంతో మంగళవారం హాస్టల్ వార్డన్ షేక్ మహబూబ్ వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులోపడి ఒకరి మృతి

నెల్లూరు(క్రైం), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని బారా షహీద్ దర్గా పక్కనున్న స్వర్ణాల చెరువులో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తుపడి మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని ప్రగతినగర్‌కు చెందిన సుభాన్(45) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన అతను తరచూ ఇంటికి రాకుండా బారాషాహీద్ దర్గా పరిసరాల్లో తిరుగుతూ రాత్రి వేళ్లలో అక్కడే నిద్రించేవాడు. ఈ క్రమంలో ఈనెల 4వ తేదీ సోమవారం ప్రమాదవశాత్తు స్వర్ణాల చెరువులోపడి మునిగిపోయాడు. మంగళవారం మృతదేహం బయటకు రావడంతో స్థానికులు దర్గామిట్ట పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సుభాన్ సోదరుడు జిలానీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నెక్లస్ మాయంపై కేసు

నెల్లూరు(క్రైం), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : బీరువాలోని బంగారు నెక్లస్ మాయమైన ఘటనపై వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని రాజీవ్ గృహకల్పలో సునీల్‌కుమారి అనే మహిళ ఒంటరిగా నివసిస్తోంది. ఆమె ఇంట్లో అదే ప్రాంతానికి చెందిన ఓ మహిళ ఏడు నెలలుగా పనిచేస్తోంది. ఆ మహిళ ఇటీవల కాలంలో పని మానేసింది. గతనెల 27వ తేదీన సునీల్ కుమారి బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు చూస్తుండగా 13 గ్రాముల నెక్లస్ కనిపించలేదు. దీంతో మంగళవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన ఇంట్లో పనిచేసిన మహిళపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అవయవ దానంతో ప్రాణదానం

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : అవయవ దానం ద్వారా ఎంతో మంది ప్రాణాలు కాపాడవచ్చని చెన్నై గ్లినిగల్స్ ఆసుపత్రి లివర్ మార్పిడి వైద్య నిపుణుడు డాక్టర్ రజనీకాంత్ తెలిపారు. మంగళవారం నగరంలోని చెన్నై గ్లినిగల్స్ ఇన్ఫర్మేషన్ సెంటర్‌లో విలేకరులతో మాట్లాడారు. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి లివర్, గుండె, ఊపిరితిత్తులు, మూత్ర పిండాలు సేకరించి మరి కొంత మందికి ప్రాణదానం చేయవచ్చని చెప్పారు. జిల్లాలోని 50 మంది రోగులకు లివర్ మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో లివర్‌మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న రమేష్, సత్యనారాయణ, సెంటర్ నిర్వాహకుడు కార్తీక్ హర్ష తదితరులు పాల్గొన్నారు.

పొలంలో అక్రమంగా రోడ్డు


నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలం మండలం తిక్కవరప్పాడు గ్రామంలో పట్టా పొలంలో కొందరు అక్రమంగా రోడ్డు నిర్మించారని బాధితుడు తమలపాకుల ఏడుకొండలు ఆరోపించారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల అధికారులు, టీడీపీ నాయకులు తమపై దౌర్జన్యం చేసి పట్టా భూమిలో అక్రమంగా రోడ్డు నిర్మిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరారు.

జిల్లాలో 4 ఎస్ఎస్‌టీఎల్‌లు

● కేంద్రమంత్రి రామ్‌నాథ్ ఠాకూర్

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లాలో భూసార పరీక్షల కోసం నాలుగు స్టాటిక్ సాయిల్ టెస్టింగ్ ల్యాబ్ (ఎస్ఎస్ఎల్‌టీ)లు, ఒక మొబైల్ టెస్టింగ్ ల్యాబ్, 74 మినీ సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసినట్లు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాగూర్ చెప్పారు. మంగళవారం నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి లోక్‌సభలో అడిన ప్రశ్నకు ఆయన పై విధంగా సమాధానం ఇచ్చారు.









బాగు చేయండి!

నగరంలోని మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న ఏసీ కూరగాయల మార్కెట్‌లో మరుగుదొడ్ల మూసివేతతో వ్యాపారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్కెట్‌కు జిల్లా నలుమూలల నుంచి రోజూ వేలాది మంది వ్యాపారం, కొనుగోళ్ల కోసం వస్తుంటారు. వారి సౌకర్యార్థం మార్కెట్‌లో మరుగుదొడ్లు నిర్మించారు. అయితే నాలుగు నెలలుగా అవి మూసివేయడంతో వ్యాపారులు, మహిళలు, వృద్ధులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మరమ్మతుల పేరుతో మరుగుదోడ్లు మూసివేయడంతో కొందరు రోడ్ల పక్కనే మూత్ర విసర్జన చేస్తున్నారు. దీనివల్ల పరిసర ప్రాంతం కంపుతో నిండిపోయింది. దీనికితోడు మరుగుదొడ్లున్న ప్రాంతం మందుబాబులకు డెన్‌గా మారింది. ఈ నేపథ్యంలో త్వరగా మరుగుదోడ్లను బాగుచేసి వినియోగంలోకి తీసుకురావాలని వ్యాపారులు అధికారులను కోరుతున్నారు.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్

వైభవంగా కొల్హాపురి మహాలక్ష్మి పూజ



వెండి చీరలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని స్టోన్‌హౌస్‌పేట కన్యకపరమేశ్వరి ఆలయంలో శ్రావణ మంగళవారం సందర్భంగా కొల్హాపురి మహాలక్ష్మి అమ్మవారి పూజ వైభవంగా జరిగింది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉభయకర్తలుగా గుండ్లపల్లి పద్మప్రియ బృందం వ్యవహరించారు. సాయంత్రం 6గంటలకు అమ్మవారికి పూలంగిసేవ, ప్రత్యేక అలంకారం జరిగాయి. రాత్రి 8గంటలకు 108 మంది మహిళలకు పసుపు, కుంకుమ, జాకెట్టు, గాజులు పంపిణీ చేశారు. ఉభయకర్తలుగా శ్రీవాసవీ మాత ఆర్యవైశ్య సేవా సంఘం వారు వ్యవహరించారు. అనంతరం వెండి రథంలో అమ్మవారిని ఊరేగించారు. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు షేగు షణ్ముఖరావు, ప్రధాన కార్యదర్శి నిచ్చెనమెట్ల చిరంజీవి, కోశాధికారి ఉమ్మెన జనార్దన్ తదితరులు పర్యవేక్షించారు.

8 నుంచి మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కోదండ రామపురంలో ఉన్న మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవాలు ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు జరుగుతాయని దేవస్థానం పాలక మండలి ఓ ప్రకటనలో పేర్కొంది. 8వతేదీ ఉదయం గోపూజ, సంకల్పం, గణపతి పూజ, అభిషేకం, వరలక్ష్మీ వ్రతం, సామూహిక కుంకుమార్చన, సాయంత్రం అమ్మవారికి బోనాల ఉత్సవాలు జరుగుతాయని తెలిపింది. 9వతేదీ ఉదయం కలిశ స్థాపన, మండపారాధన, అగ్ని ప్రతిష్ఠ, గణపతి హోమం, అభిషేకం, చండీ హోమం, సాయంత్రం మహాలక్ష్మీ హోమం జరుగుతాయ ని పేర్కొంది. 10వతేదీ ఉదయం అమ్మవారికి అభిషేకాలు, హోమాలు, మహాపూర్ణాహుతి, అన్నదానం, రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంక టేశ్వరస్వామి కల్యాణోత్సవం జరుగుతాయని, భక్తులందరూ తరలిరావాలని కోరారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులతో ఉజ్వల భవిత

● తిరుపతి కేంద్రం అధ్యాపకుడు శివరామకృష్ణ



విలేకరుల సమావేశంలో విద్యా సంస్థ ప్రతినిధులు

నెల్లూరు(విద్య), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : పర్యాటక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు చదివితే ఉజ్వల భవిత ఉంటుందని అధ్యాపకుడు ఎన్ శివరామకృష్ణ చౌదరి అన్నారు. నగరంలోని ఏపీ టూరిజం హోటల్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర పర్యాటక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహిస్తున్న స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, క్యాటరింగ్ టెక్నాలజీ, అప్లైడ్ న్యూట్రీషియన్ కళాశాలలో కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తు న్నామని చెప్పారు. బీఎస్సీ(హెచ్, హెచ్ఏ) మూడేళ్ల డిగ్రీకి ఇంటర్‌లో 40 శాతం మార్కులు సాధించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కోర్సులో ఎఫ్ అండ్ బీ ప్రొడక్షన్, ఎఫ్ అండ్ బీ సర్వీస్, ఫ్రంట్ ఆఫీస్, హౌస్ కీపింగ్ నేర్పించి 4 నెలలు ప్రముఖ ఫైవ్ స్టార్ హోటల్‌లో ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇస్తామన్నారు. అలాగే సీసీఎఫ్‌పీపీ కోర్సుకు టెన్త్ పాసైన వారు అర్హులని తెలిపారు. వీరికి ఏడాదిపాటు దేశ, విదేశాల వంటకాలు నేర్పించి ఆరు నెలలు ప్రముఖ ఫైవ్ స్టార్ హోటల్స్‌లో ప్రాక్టికల్స్ చేయిస్తామన్నారు. సీసీఎఫ్‌బీఎస్ కోర్సుకు టెన్త్ పాసైన విద్యార్థులు అర్హులని, వీరికి ఐదునెలలు రెస్టారెంట్, బార్ సర్వీస్ నేర్పించి నెలరోజులు ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇస్తామ న్నారు. కోర్సులు పూర్తయిన తరువాత రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక హోటళ్లు, ప్రముఖ ఫైవ్‌స్టార్ హోటళ్లలో ఉద్యోగావకాశాలు కూడా కల్పిస్తామని చెప్పారు. ఈ కోర్సులు చదువుకునేందుకు విద్యార్థులకు బ్యాంక్‌లోన్ సదుపాయం కూడా ఉంటుందని, కళాశాల ప్రాంగణంలో హాస్టల్ సదుపాయం కూడా ఉందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 13వతేదీ లోపు దరఖాస్తులు అందచేయాలని కోరారు. దరఖాస్తులు, పూర్తి వివరాల కోసం www.sihmtpt.org వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీటీడీసీ హరిత హోటల్ మేనేజర్ సాల్విన్ రెడ్డి పాల్గొన్నారు.

శభాష్ సూర్య!

క్రికెట్ క్రీడాకారుడికి అభినందన



విద్యార్థి సూర్యను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

నెల్లూరు(విద్య), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న క్రికెట్ క్రీడాకారుడు ఏవీ సూర్య పలు పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నాడని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ శ్రీనివాసులు అభినందించారు. కళాశాలలో మంగళవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యూత్ స్పోర్ట్స్ ప్రమోషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నేపాల్‌లో జరిగిన స్నేహపూరిత క్రికెట్ పోటీల్లో సూర్య రాణించాడన్నారు. భవిష్యత్‌లో మరింతగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వోడీలు డాక్టర్ కే మురళి, కిషోర్, క్రీడా ప్రతినిధి వరప్రసాద్ పాల్గొన్నారు.

వీఆర్ హైస్కూల్‌పై ఎమ్మెల్సీ విమర్శలు సరికాదు

● డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వీఆర్ ఉన్నత పాఠశాల నిర్వహణపై ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి విమర్శలు చేయటం దుర్మార్గమని నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ మండి పడ్డారు. మంగళవారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. విద్యా బుద్ధులు నేర్పిన వీఆర్ ఉన్నత పాఠశాలలో పేదలకు అత్యుత్తమ విద్యా బోధన అందించాలన్న ఉద్దేశంతో మంత్రి పొంగూరు నారాయణ ఆ పాఠశాలను పునఃప్రారంభించారన్నారు. 1000 మంది పేద పిల్లలను చదివిస్తుంటే అభినందించాల్సిందిపోయి ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు లేఖ రాయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మైపాడు రోడ్డులో ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ బజార్‌పై కూడా ఇదేవిధంగా ఎస్‌జీటీలో కేసు వేశారన్నారు. అయితే ఆ కేసును ఎస్‌జీటీ డిస్పోజ్ చేసి దుకాణాల వెనుక ఉన్న కాలువలో చెత్త వేయవద్దని మాత్రమే సలహా ఇచ్చిందని చెప్పారు. మైనింగ్‌పై ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి స్పష్టత ఇచ్చారని, అయితే మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ మాత్రం పెద్ద ఎత్తున మైనింగ్ అక్రమాలకు పాల్పడ్డారని వెల్లడించారు.

కలుషిత నీరు, పౌష్టికాహార లోపంతో 'ఫ్లోరోసిస్'

● రాష్ట్ర ఫ్లోరోసిస్ కన్సల్‌టెంట్ డాక్టర్ దివ్య

కావలి రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కలుషిత నీరు, పౌష్టికాహార లోపమే ఫ్లోరోసిస్‌కు కారణమని రాష్ట్ర ఫ్లోరోసిస్ కన్సల్‌టెంట్ డాక్టర్ దివ్య పేర్కొన్నారు. మండలంలోని తుమ్మలపెంట, సర్వాయపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలోని తుమ్మలపెంట, మోర్లవారిపాలెం, కొత్తపల్లి, సిరిపురం గ్రామాల్లో పాఠశాలల్లో విద్యార్థులకు మంగళవారం ఫ్లోరోసిస్ వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పళ్లు వంకర్లు పోవడం, ఎముకలు పటిష్ఠం లేకుండా వంగిపోవటం ఫ్లోరోసిస్ లక్షణాలన్నారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో పాటు సర్వాయపాలెం ప్రాథ మిక ఆరోగ్యకేంద్రంలో ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్వాయపాలెం, తుమ్మలపెంట పీహెచ్ సీల వైద్యులు ప్రతిమ, శ్రీనివాసులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొనా

అథ్లెటిక్ కోచ్ రజనీకాంత్‌కు అభినందనలు



కోచ్ రజనీకాంత్‌తో క్రీడాకారులు

నెల్లూరు(విద్య), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో అథ్లెటిక్ కోచ్‌గా పనిచేస్తున్న రజనీకాంత్‌ను క్రీడాకారులు అభినందించారు. స్టేడియంలో మంగళవారం జరిగిన అభినందన కార్యక్రమంలో క్రీడాకారులు మాట్లాడుతూ నిత్యం తమకు ఉత్తమ శిక్షణ అందిం చడంతోపాటు కానిస్టేబుల్ ఎంపికలకు పూర్తి స్థాయిలో సన్నద్ధం చేశార న్నారు. ఆయన శిక్షణలో 20 మంది కానిస్టేబుళ్లుగా ఎంపికైనట్లు చెప్పారు. యువ క్రీడాకారులకు తమవంతు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు బీ దుర్గా ప్రసాద్, కే ప్రసన్నకుమార్, డీ శ్రీనివాసులు, తరుణ్ శ్రీనాథ్, విశ్వనాథ్, నవీన్, సాయి, మౌర్య, హరీష్, హేమలత పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు

● సీఐ సాంబశివరావు

నెల్లూరు(విద్య), ఆగస్టు 5 (ఆంధ్ర జ్యోతి) : విద్యార్థులను ర్యాగింగ్ పేరుతో వేధిస్తే చర్యలు తప్పవని బాలాజీనగర్ సీఐ కే సాంబశివరావు హెచ్చరించారు. నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం బీటెక్ విద్యార్థులకు అవ గాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థలు ర్యాగింగ్ నిరోధానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు విద్యా ర్థులు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా పర్యవేక్షిస్తుండాలని సూచించారు. వేధింపుల కారణంగా విద్యా ర్థులపై కేసులు నమోదైతే వారి భవిష్య త్తుకు ఇబ్బందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీ శ్రీనివాసులు రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ హజరత్తయ్య, ఈసీఈ విభాగాధిపతి డాక్ట ర్ కే మురళి, ఏజీఎం శ్రీధర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం చంద్రమో హన్, సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను ఒప్పుకోం! : సీపీఎం



సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

నెల్లూరు రూరల్, ఆగస్టు 5,(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారుల నడ్డి విరిచే స్మార్టు మీటర్ల వాడకాన్ని ఎట్టిపరిస్థితుల్లో స్వాగతించేది లేదని సీపీఎం నాయకులు స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్త ఆందోళనల్లో భాగంగా మంగళవారం మండలంలోని సౌత్‌మోపూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. పార్టీ మండల కార్యదర్శి పూడిపర్తి జనార్దన్, నాయకుడు తిరుపాలు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే విద్యుత్ భారాన్ని తగ్గిస్తామంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు హామీ ఇచ్చాయని, కానీ అందుకు విరుద్ధంగా పనిచేస్తున్నాయని విమర్శించారు. విద్యుత్ వ్యవస్థను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టే ప్రమాదకర ఒప్పందాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎట్టిపరిస్థితుల్లోనూ అవి జరగనివ్వమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీప్రసాద్, ప్రభాకర్, పాదర్తి మస్తానయ్య, బాలు ఆదిశేషయ్య, అబ్దుల్లా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌తో చట్టబద్ధత పొందండి

● నగర మేయర్ స్రవంతి

నెల్లూరు(సిటీ), ఆగస్టు 5,(ఆంధ్రజ్యోతి) : అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఎల్ఆర్ఎస్ పథకం ద్వారా సదరు ప్లాట్లకు చట్టబద్ధత పొందాలని నగర మేయర్ స్రవంతి పిలుపునిచ్చారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో నక్ష సర్వేపై ప్రజాప్రతినిధులు, ఎల్టీపీలు, బిల్డర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జూన్ 30వ తేదీలోపు కొనుగోళ్ల ద్వారా రిజిస్ట్రేషన్లు చేసుకున్న వారంతా ఎల్ఆర్ఎస్‌కు అర్హులని తెలిపారు. ఇలా చట్టబద్ధత చేసుకోవడం ద్వారా భవన నిర్మాణ అనుమతులు సులువుగా లభిస్తాయని చెప్పారు. దీనిపై అనుమానాలుంటే కార్పొరేషన్ కార్యాలయంలోని 0861-2316777 నెంబరుకు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సిటీప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

'సూర్యఘర్'ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : పీఎం సూర్యఘర్ పథకం ప్రయోజనాలు ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత విద్యుత్ శాఖ అధికారులదేనని ఆ శాఖ ఎస్ఈ విజయన్ స్పష్టం చేశారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో మంగళవారం ఆయన టౌన్ డివిజన్ అధికారులతో సమీక్ష జరిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ4 బంగారు కుటుంబం కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. విద్యుత్ అదనపు లోడ్‌కు 50 శాతం రాయితీ డిసెంబరు 31వ తేదీ వరకు లభించనుందని, దీనిపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు అశోక్, సునీల్, కిరణ్, అకౌంట్స్ విభాగాధికారులు బొబ్బిలి సురేఖ, ఆశాలత, టౌన్ డివిజన్ విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

వినాయక చవితి మండపాలకు ఉచిత కరెంటు ఇవ్వాలి



విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్‌కు వినతిపత్రం ఇస్తున్న విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి నాయకులు

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి గణేష్ మండపాలకు ఉచితంగా కరెంటు ఇవ్వాలని విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి కోరింది. ఈ మేరకు ఆ సమితి నాయకులు మంగళవారం విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్‌కు వినతిపత్రం ఇచ్చారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 27 నుంచి 31వతేదీ వరకు వినాయక చవితి ఉత్సవాలు జరుగుతాయని, ఆ సందర్భంగా ఏర్పాటు చేసే మండపాలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే వినాయక నిమజ్జనం సందర్భంగా నిర్వహించే శోభాయాత్రలో ఇబ్బందులు ఎదురవకుండా తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను, చెట్ల కొమ్మలకు చుట్టుకుని ఉండేవాటిని సరిచేయాలని కోరారు. దీనికి అధికారులు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షుడు పీ సత్యనాగేశ్వరరావు, గౌరవ సలహాదారుడు పీ సురేంద్రరెడ్డి, అధ్యక్షుడు కే శ్రీకాంత్, వేలూరు మహేష్, భాస్కర్‌రెడ్డి, హర్షవర్ధన్, శ్రీనివాసులురెడ్డి, సుందరరామిరెడ్డి, నారా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు



కోవూరులో ఎడారి ఓడ..!

ఒంటెను చూస్తే.. పిల్లలకు భలే సరదా! నాలుగైదేళ్ల చిన్నారులైతే ఒంటె ఊళ్లోకి వచ్చిందంటే.. చూపించమని ఒకటే గోల చేస్తారు. తీరా..అక్కడికి తీసుకెళితే.. 'ఆ...య్.. భలే భలే ఒంటె..' అంటూ సంతోషంతో కేరింతలు కొడతారు. అంతేకాదు.. తీరా దగ్గరికెళితే.. ఆ భారీ పర్సనాలిటీని చూసి.. 'వామ్మో.. వీపు ఎంత ఎత్తుంది.. మెడ బారెడు పొడవుంది..' అని ఆశ్చర్యపోతారు. అయినా ఒక్కసారైనా ఒంటెపైకెక్కి అలా..అలా.. ఊరంతా షికారు కెళ్లాలని ముచ్చటపడి పోతారు. అలా.. నాలుగు రౌండ్లు వేసి ఆకాశమంత సంబరాన్ని సొంతం చేసుకుంటారు. ఇప్పుడు మన కోవూరుకు 'ఎడారి ఓడ' వచ్చేసింది.. వాడ వాడలో సందడి చేస్తోంది. మరెందుకిక ఆలస్యం..? పిల్లలూ.. పదండి.. పదండి.. ఒంటెపై అలా.. ఊరంతా ఓసారి చుట్టేద్దాం!

- కోవూరు, (ఆంధ్రజ్యోతి)



పేదవాడి బతుకు పోరు

ఈ చిత్రం చూశారా..? ఉదయగిరి కోళ్లవీధిలో మంగళవారం ఓ వ్యక్తి మురుగు కాలువలోకి దిగి అక్కడున్న ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్నాడు. చెత్తకుప్పలు, మురుగు కాలువల్లో ఉన్న ప్లాస్టిక్, ఇతరత్రా వ్యర్థాలను సేకరించి, వాటిని విక్రయించగా వచ్చిన నగదుతో అతను ఆకలి తీర్చుకుంటున్నాడు. ప్రజలకు వ్యర్థమైన వస్తువులు కడుపు నింపేవిగా భావించి పట్టణంలో కొందరు ఈ వృత్తిని కొనసాగిస్తున్నారు.

- ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

సీబీఎస్ఈ క్లస్టర్ అథ్లెటిక్ పోటీల ప్రారంభం

వెంకటాచలం మండలంలోని చవటపాళెం పంచాయతీ సరస్వతీ నగర్ వద్ద గల అక్షర విద్యాలయంలో మంగళవారం సీబీఎస్ఈ క్లస్టర్ - 7 అథ్లెటిక్ క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి 2700 మంది విద్యార్థులు, 400 మంది కోచ్‌లు ఈ పోటీలలో పాల్గొనేందుకు తరలివచ్చారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి పోటీలను ప్రారంభించారు. స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ క్రీడా పోటీలను అక్షర పాఠశాల డైరెక్టర్ కుముదా, ప్రిన్సిపాల్ ప్రియా జాకబ్ పర్యవేక్షించారు. ఆగస్టు 10వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని వారు తెలిపారు.

- వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి)


ఒకప్పుడు అరుదు.. నేడు అంతటా!

ఖండాంతరాలు దాటి జిల్లాకు చేరిన పంట

2010లో దేశంలోకి ప్రవేశం ● 2020కల్లా పల్లెలకు విస్తరణ

డ్రాగన్ రంగు.. రుచి.. ఆదాయం!

● జిల్లా లో 200 ఎకరాల్లో సాగు ● గిరాకీ, ప్రభుత్వ ప్రోత్సాహంతో రైతుల ఆసక్తి



చుడటానికి చక్కటి గులాబీ రంగులో కాస్త వింతగా ఉంటుంది. కోస్తే లోపలంతా విత్తనాలు వెదజల్లినట్లు పరుచుకుని ఆసక్తిగా కనిపిస్తుంది. తింటే రుచికరంగా ఉండటమేకాక నిండా పోషకాలు కలిగి ఆరోగ్యాన్ని ఇస్తుంది... అదే డ్రాగన్ ఫ్రూట్. విదేశాల నుంచి దిగుమతి అయిన ఈ పంట ఇప్పుడు జిల్లాలో చాలా చోట్ల సాగవుతోంది. ఒకప్పుడు సంపన్నులకే సొంతమైన డ్రాగన్ పండ్లు ఇప్పుడు ఇక్కడే పండుతుండటంతో సామాన్యులకూ అందుబాటులోకి వచ్చాయి. దీర్ఘకాలం సాగుచేసే అవకాశం, తగినంత ఆదాయం ఉండటంతో రైతులు ఈ విదేశీ పంటను విరివిగా సాగులోకి తెస్తున్నారు. ప్రభుత్వమూ వారికి భారీగా ప్రోత్సాహకాలు ఇస్తుండటంతో జిల్లాలో డ్రాగన్ విస్తరిస్తోంది.

నెల్లూరు రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర అమెరికా ఖండంలోని మెక్సికో దేశంలో పురుడుపోసుకున్న కాక్టస్ జాతికి చెందిన పిటాయ మొక్కకు కాసే డ్రాగన్ ఫలం ఖండాంతరాలు దాటి జిల్లాకు చేరింది. ప్రపంచ వ్యాప్తంగా వాణిజ్య పరమైన పంటగా ఖ్యాతి గడించిన ఈ పంట 2010లో మన దేశంలోకి తొలి అడుగుపెట్టింది. ఆ తర్వాత 2015లో తెలుగు రాష్ట్రాలకు పరిచమై 2020 నాటికి పల్లెలకు విస్తరించింది. నేడు వరికి ప్రత్యామ్నాయ (ఉద్యాన సాగులో) ప్రధాన పంటగా మారింది. ప్రస్తుతం జిల్లా రైతులకు ప్రియమైన పంటల్లో ఒకటిగా మారి దాదాపుగా 200 ఎకరాలకుపైగా సాగవుతోంది.

ప్రభుత్వ ప్రోత్సాహంతో పెరిగిన విస్తీర్ణం

డ్రాగన్ ఫ్రూట్ సాగు ఒకప్పుడు ఖరీదైన పంట. పెద్ద రైతులు తప్ప, చిన్న సన్నకారు రైతులు సాగు చేయలేని పరిస్థితి ఉండేది. కాల క్రమేణ ఈ పంటకు డిమాండ్ పెరగడం, ఆదాయం బాగుండటంతో రైతులు ఆసక్తి చూపడం మొదలైంది. దీనికితోడు విదేశీ జాతికి చెందిన పంట అయినప్పటికీ డ్రాగన్ ఫ్రూట్ సాగుకు రాష్ట్ర ప్రభుత్వం మంచి రాయితీలు అందిస్తుండటంతో రైతులు దీనిని సాగు చేసేందుకు సుముఖత చూపారు. తొలి రెండేళ్లకు కలిపి హెక్టారుకు ఏకంగా రూ.2.70 లక్షల వరకు పంట పెట్టుబడిలో రాయితీని ఉద్యానశాఖ అందిస్తుండటంతో అక్కడక్కడ 5 నుంచి 10 ఎకరాలు సాగు చేస్తు ఈ పంటకు అలవాటైన రైతాంగం ప్రస్తుతం 200 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. మొక్కలు ఏడాదికి కాపుకు రావడం, యాజమాన్య పద్ధతులు పాటిస్తే కొన్నేళ్లదాకా సాగుచేసుకునే అవకాశం ఉండటంతో మెట్ట ప్రాంత రైతులు వరికి ప్రత్యామ్నాయంగా డ్రాగన్ ఫ్రూట్‌ను పండిస్తున్నారు. ప్రధాన రహదారుల కు అనుకుని ఉన్న పొలాల్లో అత్యధిక శాతం సాగు చేస్తున్నారు. నీటి అవసరాలు తక్కువ, రాతి భూమికి అలవాటైన పంట కావడంతో మెట్ట రైతులకు కలిసొచ్చింది. నష్ట రహిత పంటగా పేరుండటం, దేశ విదేశాలతోపాటు స్థానిక మార్కెట్‌లోనూ గిరాకీ ఉండటంతో ఏడాదికేడాదికి డ్రాగన్ ఫ్రూట్ సాగు విస్తీర్ణం పెరుగుతోంది.

వీధి దుకాణాల్లోనూ లభ్యం

కొన్నేళ్ల క్రితం వరకు అరుదైన పంటగా గుర్తింపు పొందిన డ్రాగ న్ ఫ్రూట్, నేడు అన్నీ ప్రాంతాల్లో అందుబాటులోకి వచ్చింది. మాల్స్, సూపర్ మార్కెట్లను దాటి వీధి దుకాణాల్లోనూ దర్శనమిస్తోంది. ఒక్కప్పుడు కాయ ఒక్కోటి రూ.200-250 వరకు పలికేది. కానీ స్థానికంగా సాగు పెరగడంతో నేడు కిలో రూ.100 నుంచి 120కి లభిస్తుండటం విశేషం.



పొదలకూరు-సోమశిల రహదారిపై తోట పక్కనే డ్రాగన్ ఫ్రూట్స్ అమ్మకం

రాయితీలతో రైతులకు ప్రయోజనం



డ్రాగన్ ఫ్రూట్ సాగుచేసే రైతులకు ప్రభుత్వం నుంచి మంచి ప్రోత్సాహం ఉంది. అధిక మొత్తంలో రాయితీ ఇస్తుండటంతో ఎక్కువ మంది ఈ పంటను సాగు చేసేందుకు ఇష్టపడుతున్నారు. పైగా కొన్నేళ్లపాటు పంట కాస్తూనే ఉంటుంది. మంచి మార్కెట్ చూసుకుంటే లాభాలు బాగా వస్తాయి.

- ప్రసన్న, ఉద్యాన శాఖ అధికారి

విదేశీ పంట కావడంతో క్రేజ్



విదేశీ సంతతికి చెందిన పంట కావడంతో మనకు బాగా క్రేజ్ పెరిగింది. చాలా మంది ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు. ఈ పంటకు మార్కెటింగ్ పెద్దగా అవసరం లేదు. రహదారుల పక్కన, కూడళ్ల వద్ద అందుబాటులో ఉంచినా కొంటున్నారు.

- సునీల్ రెడ్డి, రైతు, కాకుపల్లి

మంచి ఆదరణే ఉంది



బయట దేశాల్లో పుట్టిందని ఈ పంటను ఒకప్పుడు అందరూ వింతగా చూసే వాళ్లు. ఏళ్లు గడిచేకొద్దీ ఆదరణ పెరిగింది. గిరాకీ ఉండటంతో తోటల దగ్గరే పంటను అమ్మేసుకోవచ్చు. మెట్ట ప్రాంతాలకు కలిసొచ్చే పంట కావడంతో నీటి వసతి పెద్దగా లేని రైతులు కూడా దీనిని సాగు చేస్తున్నారు.

- గంటా వెంకటేశ్వర్లు, రైతు, వనంతోపు



విధుల పట్ల ఇంత నిర్లక్ష్యమా?

11 గంటలైనా తెరుచుకోని గాదెలదిన్నె సచివాలయం తలుపులు

విడవలూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విడవలూరు మండలంలోని పంచాయతీ, సచివాలయ అధికారులు సకాలంలో విధులకు హాజరు కాకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.. మండలాధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో ఉదయం 10 గంటలకు విధులకు హాజరు కావాల్సిన అధికారులు, సిబ్బంది 11 గంటలైనా హాజరు కావటంలేదు. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈస్ట్రన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి ఓ పని నిమిత్తం సోమవారం విడవలూరు సచివాలయానికి ఉదయం 10.30 నిమిషాలకు వెళ్లారు. ఆ సమయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ మినహా ఎవ్వరూ విధులకు హాజరు కాలేదు. దీంతో మండలాధికారుల పనితీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. తాజాగా మంగళవారం గాదెలదిన్నె సచివాలయం ఉదయం 11 గంటలైనా విధులకు ఒక్కరు కూడా రాకపోవటంతో తలుపులు తెరుచుకోలేదు. వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వచ్చిన ప్రజలు నిరాశతో వెనుదిరిగారు. దీంతో అధికారుల పనితీరు పట్ల స్థానిక నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎంపీడీవో నగేష్‌కుమారిని వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దైవదర్శనం చేసుకుని తిరిగి వస్తూ అనంతలోకాలకు..

● ఆగి ఉన్న కారును ఢీకొన్న మరో కారు
● ఒకరు మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు
● మృతుడు ఆంధ్రజ్యోతి ఏసీవో
● నాయుడుపేటలో విషాదం



ప్రమాదంలో దెబ్బతిన్న కార్లు



మృతుడు రాజేంద్ర (ఫైల్)

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్)/నాయుడుపేట టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : దైవ దర్శనం చేసుకున్నామన్న ఆనందం వారిలో ఎంతో సేపు నిలవలేదు. భోజనం కోసం ఓ హోటల్ వద్ద ఆగిన వారి కారును మరో కారు ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం భోగ్యంవారిపల్లి బస్టాండ్ సెంటర్ సమీపం సోమవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు, బాధితు కుటుంబ సభ్యుల కథనం మేరకు..

తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన పూల రాజేంద్ర (41) ఆంధ్రజ్యోతి సర్క్యులేషన్ విభాగంలో (ఏసీవో) పని చేస్తున్నారు. తన నలుగురు స్నేహితులతో కలిసి కారులో నాయుడుపేట నుంచి శ్రీశైలంకు వెళ్లారు. అక్కడ దైవదర్శనం అనంతరం తిరిగి వస్తుండగా మార్గమధ్యలో నెల్లూరుజిల్లా వరికుంటపాడు మండలం తిమ్మారెడ్డిపల్లి వద్ద ఓ హోటల్ వద్ద సోమవారం రాత్రి భోజనం కోసం ఆగారు. ఇద్దరు కారులో నుంచి కిందకు దిగగా, మరో ముగ్గురు కారులోనే ఉన్నారు. అంతలో దుత్తలూరు వైపు నుంచి వేగంగా వెళ్తున్న మరో కారు ఢీకొంది. దీంతో కారులో ఉన్న రాజేంద్రతోపాటు చెందేటి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రకాశం జిల్లా పామూరు వైద్యశాలకు తరలించగా, అప్పటికే రాజేంద్ర మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మిగిలిన ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రఘునాథ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారుతో సహా డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా మంగళవారం రాజేంద్ర మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. రాజేంద్ర స్వస్థలం చిత్తూరు జిల్లా నింద్ర మండలం కావనూరు గ్రామం కావడంతో మృతదేహాన్ని ఆ గ్రామానికి తీసుకువెళ్లారు. ఈ ఘటనతో నాయుడుపేట, కావనూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, మృతుడు రాజేంద్రకు భార్య రాధ, కొడుకు దినేష్ ఇంటర్ చదువుతుండగా, కుమార్తె భవ్య 9వ తరగతి చదువుతోంది.



క్యాన్సర్ సర్వేపై శిక్షణను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

క్యాన్సర్ సర్వే పక్కాగా చేపట్టాలి

శిక్షణ ప్రారంభంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌సీడీ 4.0 ఇంటింట క్యాన్సర్ సర్వేను పక్కాగా చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత ఆదేశించారు. నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వం వైద్య కళాశాలలో మంగళవారం ఇంటింట క్యాన్సర్ సర్వేపై జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్‌లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. శిక్షణ పొందిన వైద్యులు, హెల్త్ ఎడ్యుకేటర్లు, ఆరోగ్య సిబ్బంది పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో క్యాన్సర్ బాధితులను గుర్తించాలని సూచించారు. ఇంటివద్దే ప్రాథమిక స్క్రీనింగ్ చేసి వివరాలు నమోదు చేయాలన్నారు. సర్వేలో ప్రజలతో ఎలా మాట్లాడాలి, డేటా నమోదుపై సూచన లిచ్చారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు మండలాల్లో క్షేత్ర స్థాయి సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ యశ్వంత్, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

డీసీ పల్లి కొనుగోలు కేంద్రం నుంచి పొగాకు బేళ్లను వెనక్కి తీసుకెళ్తున్న రైతులు



చూసి కొనండి సార్..!

పొగాకు రైతుల వేడుకోలు ● నాణ్యత లేదనే సాకుతో బేళ్లు వెనక్కు..

మర్రిపాడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది కూడా పొగాకు రైతులకు తిప్పలు తప్పటంలేదు. నాణ్యత లేదంటూ పొగాకు బేళ్లను తిరస్కరించడంతో వారు నానా యాతన పడుతున్నారు. గత ఏడాది మంచి ధరలు లభించటంతో రైతులు అధికంగా పొగాకును సాగు చేశారు. తీరా దిగుబడులు చేతికి రావడంతో భిన్నమైన పరిస్థితులు ఎదురవుతున్నాయి. అన్నీ రకాల బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేయక పోవటంతో ప్లీజ్.. చూసి కొనండి సార్....! అంటూ వచ్చిన బయ్యర్లను రైతులు వేడుకుంటు న్నారు. వ్యాపారులు మాత్రం ఆచీతూచీ వ్యవహరించడంతో కొనుగోళ్లు కూడా మందగమనంగా సాగుతున్నాయి.

● రైతుల ఆవేదన

ప్రతీరోజూ డీసీపల్లి వేలం కేంద్రంలో 150 నుంచి 200బేళ్లకు పైగా తిరస్కరణకు గురవుతున్నాయి. దీంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. బోర్డు పరిధిలోని పది మండలాల్లో 1738 పొగాకు బ్యారన్లు ఉన్నాయి. ఈ ఏడాది పంట కాలానికి 2,069మంది రైతులు 5861.91హెక్టార్లల్లో పొగాకు సాగుచేశారు. బోర్డు 7.4మిలియన్ కేజీలకు అనుమతి ఇవ్వగా, ఇప్పటి వరకు రైతుల నుంచి 6.72 మిలియన్ కేజీలను కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. అనుమతికి మించి సాగు చేసిన పొగాకు కూడా రైతుల వద్దే ఉంది. ఈ మొత్తం కొనుగోలు చేసే సమయానికి పొగనార్లు పోసి, తిరిగి పొగ నాట్లు కూడా ప్రారంభమయ్యే అవకాశం లేకపోలేదని రైతులు చెబుతున్నారు. మంగళవారం బోర్డుకు రైతులు 358బేళ్లను తీసు కొని రాగా, 244బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 114బేళ్లను తిరస్కరించారు. కాగా గరిష్ఠ ధర రూ.280 కనిష్ఠ ధర రూ.159గా ఉంది.

విడవలూరు బిట్ 1 ఎంపీటీసీ స్థానం ఏకగ్రీవం



చలంచర్ల కామేశ్వరికి ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారులు

విడవలూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విడవలూరు బిట్ 1 ఎంపీటీసీ ఎన్నికల్లో టీడీపీ బలపరిచిన అభ్యర్థి చలంచర్ల కామేశ్వరమ్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్ని కల రిటర్నింగ్ అధికారి మోహన్‌రావు, సహాయ రిటర్నింగ్ అధికారి నగేష్ కుమారి తెలిపారు. ఎంపీటీసీ ఎన్నికల్లో టీడీపీ బలపరిచిన చలంచర్ల కామేశ్వరి, కానూ రు ప్రవల్లిక నామినేషన్లు దాఖలు చేయగా, మంగళవారం కానూరు ప్రవల్లిక తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో చలంచర్ల కామేశ్వరి ఎంపీటీసీగా ఏకగ్రీవమైనట్లు అధికారులు ప్రకటించి, ఆమెకు ధృవీకరణ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు పాశం శ్రీహరి రెడ్డి, చెముకుల శ్రీనివాసులు, సత్యవోలు సత్యంరెడ్డి, బెజవాడ గోవర్ధన్ రెడ్డి చలంచర్ల కామేశ్వరిని అభినందించారు.

సీపీఎం, రైతు సంఘం నాయకుల అరెస్టు



పోలీస్ స్టేషన్‌లో సీపీఎం, రైతు సంఘం నాయకులు

ఉలవపాడు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : కరేడు పరిసర గ్రామాల్లో ఈనెల 31 వరకు పోలీస్ యాక్ట్ ఉన్నందున బయట వ్యక్తులు సమావేశాలు నిర్వహించకూడదని పోలీసులు పేర్కొన్నారు. మంగళవారం రామకృష్ణాపురంలో పర్యటించిన సీపీఎం, రైతు సంఘాల నేతలను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. పోలీసుల చర్యలను సీపీఎం జిల్లా కార్యదర్శి జీ.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో ఖండించారు. రామకృష్ణాపురంలో గ్రామ రెవెన్యూ అధికారులు గుట్టుచప్పుడు కాకుండా ఇంటింటి సర్వే పేరుతో డాక్యుమెంట్లు అడుగుతున్నారని, ప్రజల నుంచి బలవంతంగా సేకరిస్తున్నారని ఆరోపించారు. విషయం తెలిసి అమాయక గిరిజనలను అవగాహన కల్పించేందుకు వెళ్లిన సీపీఎం ఉలవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్యను స్థానిక ఎస్ఐ పోలీస్ 30 యాక్ట్ అమలులో ఉన్నందున అరెస్టు చేసి సాయంత్రం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (హరనాథపురం), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 12 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 28 అంగన్‌వాడీ కార్యకర్తలు, 168 అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టుల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి పాస్ అయిన వారు, ఈ ఏడాది జూలై 1 నాటికి 21 నుంచి 35లోపు వయసు ఈ నెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. స్థానిక వివాహిత మహిళలై ఉండాలని, అవివాహితులు అనర్హులని పేర్కొన్నారు. పోస్టుల ఎంపిక ప్రక్రియ రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఉంటుందని ప్రకటించారు.

విధుల్లో అలసత్వం వద్దు

ఉదయగిరి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్య సిబ్బంది విధుల్లో అలసత్వం వహించకుండా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి వినీత పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సీహెచ్‌సీలో వైద్యఆరోగ్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను అధిగమించాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం సిబ్బందికి మందులు, ఇంజక్షన్లు పంపిణీ చేశారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9633
వెండి కిలో ధర	రూ. 115800
వెండి ఒక గ్రాము	రూ. 118.80

శిథిలావస్థలో పశువైద్యశాలల భవనాలు

● వేధిస్తున్న వైద్యుల కొరత ● పట్టించుకోని అధికారులు

ఉదయగిరి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతాల్లో అధికశాతం మంది రైతులు పాడిని నమ్ముకొని జీవిస్తున్నారు. అయితే వీరికి పశువైద్యం దైన్యంగా మారింది. పశు వైద్యశాలలు ఉన్నా వాటికి సరైన భవన సదుపాయం లేదు. ఉన్న భవనాలు శిథిలావస్థకు చేరడంతో వైద్యులు, సిబ్బంది, పశువుల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయగిరి పశు వైద్యశాలను 1963లో నిర్మించారు. ఆ భవనం చిన్నది కావడంతో సిబ్బంది, మందులు, ఫర్నిచర్‌తో నిండిపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇక గండిపాళెం, సీతారామపురం, బసినేనిపల్లి, కుర్రపల్లి, నందిపాడు, నర్రవాడ, దుత్తలూరు తదితర భవనాలు సైతం శిథిలావస్థకు చేరాయి. కొన్నింటిలో మరుగుదొడ్లు, నీటి సౌకర్యం, ఇతరత్రా సౌకర్యాలు లేకపోవడంతో అటు సిబ్బంది, ఇటు రైతులు పడరానిపాట్లు పడుతున్నారు

● వేధిస్తున్న వైద్యుల కొరత

పశు వైద్యశాలల్లో వైద్యుల కొరత వేధిస్తోంది. సీతారామపురం, బసినేనిపల్లి, కుర్రపల్లి, నందిపాడు, నర్రవాడ, పెద్దిరెడ్డిపల్లి, అనంతసాగరం, రేవూరు, గుండెమడగల, కరటంపాడు, ఎస్ఎస్‌పేట, వరికుంటపాడు, కొండాపురం, ఇస్కపల్లి తదితర పశు వైద్యశాలల్లో వైద్యులు లేరు. ఆయా వైద్యశాలలకు ఇన్‌చార్జిలే దిక్కు. ఒక్కో వైద్యాధికారికి రెండు, మూడు వైద్యశాలలకు ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో వారు అక్కడ, ఇక్కడ మెరుగైన వైద్యసేవలు అందించలేక సతమతమవుతున్నారు. ఆయా వైద్యశాలల్లో సిబ్బంది కొరత సైతం వేధిస్తుంది. దీంతో మూగజీవాలకు మెరుగైన వైద్యసేవలు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు దృష్టిసారించి పశు వైద్యశాలలకు నూతన భవనాలు మంజూరు చేయాలని, అలాగే వైద్యులను సిబ్బందిని నియమించేలా చర్యలు చేపట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు.



కూలే దశలో ఉన్న ఉదయగిరి పశు వైద్యశాల భవనం

రేపటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు

ఉదయగిరి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణంపల్లిలో ఉన్న సీతారామలక్ష్మణ హనుమత్ సమేత రామచంద్రుడి ఆలయ ప్రథమ వార్షికోత్సవాలు గురువారం నుంచి శనివారం వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

హాస్టల్ సౌకర్యం కల్పించాలి

ఉదయగిరి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పేద విద్యార్థుల సౌకర్యార్థం హాస్టల్ సౌకర్యం కల్పించాలని జనవిజ్ఞాన వేదిక, ఎమ్మార్పీఎస్ నాయకులు షేక్ దస్తగిరిఅహ్మద్, గాజులపల్లి రామిరెడ్డి, బెజవాడ బాలగురవయ్య మంగళవారం ఓ సంయుక్త ప్రకటనలో కోరారు. పట్టణంలో ఉన్న ఎస్సీ బీసీ బాలుర, బాలికల వసతిగృహాలు మూతపడడంతో పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారన్నారు. మండలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన సుమారు వెయ్యిమంది విద్యార్థులు ఉన్నారన్నారు. వారికి హాస్టల్ వసతి కల్పిస్తే చదువుకునే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి విద్యార్థులకు హాస్టల్స్ వసతి కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

అలఘునాథుడి ఆలయంలో కుంభాభిషేక వేడుకలు



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథస్వామి

ఆత్మకూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీదేవి,భూదేవి సమేత అలఘునాథస్వామి ఆలయంలో మూడురోజుల పాటు నిర్వహించే పుష్కర మహోత్సవ మహా కుంభాభిషేకం వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం గంగానయనం, గోపూజ, యాగశాల ప్రవేశం సాయంత్రం ప్రదోషకాల పూజ, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ప్రాతఃకాలపూజ, అష్టోత్తర శతకలశాభిషేకం, హోమం నిర్వహిస్తామని నిర్వహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు కే.మధుసూదనశర్మ, ఈ. నాగభూషణం, ఆలయ అర్చకులు వీ. శ్రీనివాసశర్మ, ఆలయ కమిటీ నిర్వాహకులు కేవీ శేషారెడ్డి, కే. సుధాకర్‌రెడ్డి, పీ. సుధాకర్‌రెడ్డి, ఎన్. యానాదిరెడ్డి, పీ. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీటీఏ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో పాల్గొన్న బీటీఏ నేతలు

మర్రిపాడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం మర్రిపాడు, బ్రాహ్మణపల్లి, కదిరినేనిపల్లి కాంప్లెక్స్‌లలోని పాఠశాలల్లో ఆ సంఘం నేతలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగులకు పీఆర్సీని అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేసి, బదిలీపై వెళ్లిన వారికి జీతాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సుబ్బు, ప్రధాన కార్యదర్శులు ప్రసాద్, ఎంపీ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

చిన్న దర్గాలకు అడ్డుగా ఉన్న గోడ పరిశీలన

ఏఎస్ పేట,ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): గ్రామంలోని నాయబ్ రసూల్ దర్గా నుంచి చిన్న దర్గాలకు, శ్మశానానికి వెళ్లే దారిలో గతంతో ముతవల్లిగా ఉన్న హఫీజ్‌పాషా అడ్డంగా గోడ నిర్మించారు.దాన్ని తొలగించాలని గ్రామస్థులు మంత్రి ఆనం, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మెన్ అజీజ్‌ను కోరారు. వారి ఆదేశం మేరకు మంగళవారం కసుమూరు దర్గా ఈవో షరీఫ్ ఏఎస్ పేటకు వచ్చి పరిశీలించారు.ఈ సందర్భంగా దర్గాలో పలు అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ జిలానిబాషా, రహమత్‌నవాజ్,దర్గా అకౌంటెంట్ ఖాజా హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

దాహం తీర్చాలని వినతి

నెల్లూరు(సాంస్కృతికం),(ఆంధ్రజ్యోతి): దుత్తలూరు మండలం భైరవరం కాశీనాయన నగర్‌లో ప్రజలకు, పశువులకు తాగునీరు సౌకర్యం కల్పించాలని ఆ గ్రామకూటమి నాయకులు మంగళవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీలో పదేళ్లుగా కాపురం ఉంటున్నామని, కేవలం 10 ఇళ్లకు మాత్రమే ప్రభుత్వం నీటి సౌకర్యం కల్పించిందన్నారు. కలెక్టర్ స్పందించి తమకు నీటి సౌకర్యం కల్పించి దాహార్తి తీర్చాలని వారు కోరారు.

పోలేరమ్మకు మంత్రి ఆనం పూజలు

ఏఎస్ పేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిరమనలో ఇటీవల పోలేరమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ చేశారు. ఈ క్రమంలో మంగళవారం దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ ప్రజలకు, జాబ్‌మేళాలో పాల్గొన్న యువతకు బంగారు భవిష్యత్తుకు అమ్మ ఆశీస్సులు అందించాలని ప్రార్థించారు.



అర్హులందరికీ సంక్షేమ పథకాలు



కాలనీ వాసుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఉదయగిరి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని కావలి మార్గంలో గల ఎస్టీ కాలనీలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయా, ఏడాది ప్రభుత్వ పాలనపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలు ప్రజలు ఆయన దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుంచి మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, బొజ్జా శ్రీనివాసులు, నరసింహ, సందానీ పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి



ఆత్మకూరు : రైతులతో కలిసి వరి పొలాలను పరిశీలిస్తున్న ఎంఏవో కిశోర్‌బాబు

ఆత్మకూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్‌లో రైతులంతా తప్పనిసరిగా తమ పేర్లను ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలని ఎంఏవో కే. కిషోర్‌బాబు తెలిపారు. మండలంలోని చెర్లోయడవల్లి, మురగళ్ల రైతు సేవా కేంద్రాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి, సజ్జ, నువ్వు పంటలే కాకుండా ఉద్యాన పంటలను కూడా నమోదు చేస్తారని తెలిపారు. అనంతరం రైతులతో కలిసి ఆయన వరి పొలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు వీ. ప్రత్యూష, షేక్ బీబీ అయేషా, పలువురు రైతులు పాల్గొన్నారు.

● కత్తెర పురుగును నివారించాలి

దుత్తలూరు(ఉదయగిరి), (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పైరులో కత్తెర పురుగును ప్రాథమిక దశలోనే గుర్తించి నివారించాలని వ్యవసాయ పరిశోధనస్థానం పొదలకూరు శాస్త్రవేత్త సురేఖాదేవి, ఉదయగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు లక్ష్మీమాధవి పేర్కొన్నారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని తెడ్డుపాడులో మొక్కజొన్న పంటను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ పంటల సాగులో తగు సస్యరక్షణ చర్యలు చేపట్టి పెట్టుబడులు తగ్గించుకోవడంతోపాటు అధిక దిగుబడులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఏవో సుబ్బారెడ్డి, మండల వ్యవసాయాధికారి మదన్‌మోహన్, ఏఈవో సుస్మిత, వీఏఏ చంద్రశేఖర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరి : మొక్కజొన్న పైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో సునీత మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాజెక్టు పరిధిలోని సీతారామపురం మండలం బెడుసుపల్లి, దుత్తలూరు మండలం నర్రవాడ ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే సీతారామపురం బెస్తకాలనీ, హరిజనవాడ, మండలంలోని గుండుపల్లి, రొంపిదొడ్ల ఎస్సీకాలనీ, నెమళ్లదిన్నె, పోలంగారిపల్లి, ఉదయగిరి ఎస్సీ కాలనీ, సినిమాహాలువీధి, వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లి మెయిన్, ఆంద్రావారిపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 10వ తరగతి పాసై, ఈ ఏడాది జూలై 1 నాటికి 35 ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలని ఆమె తెలిపారు. అర్హులైన వారు ఈనెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు సోమా వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో జర్నలిస్టుల కోర్కెల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో బీ. పావనికి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులకు అక్రిడేషన్స్, ఇంటి నివాశనా స్థలాలు, హెల్త్ కార్డులు, గ్రూప్ ఇన్సూరెన్స్ తదితరు సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. తనవంతుగా జర్నలలిస్టులు అందజేసిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు పంపుతామని, ఆత్మకూరులో ప్రెస్‌క్లబ్ ఏర్పాటుకు స్థలం కేటాయింపు విషయమై పరిశీలిస్తానని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్ రమణారెడ్డి, టీ. వెంకటేశ్వర్లు, సీహెచ్‌వీ సుబ్బారావు, రహ్మత్‌ఆలీతోపాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.



ఆర్డీవోకి వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు

స్మార్ట్ మీటర్లు తొలగించాలని నిరసన



సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

అనంతసాగరం ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు బిగించిన స్మార్ట్ మీటర్లు తొలగించి, విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. అనంతసాగరం సబ్‌స్టేషన్ వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. ఈమేరకు సమస్యను అధికారులకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు అన్వర్‌బాషా, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకా



తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్తమ్మ

సీతారామపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ముర్రుపాలు బిడ్డకు తొలి టీకా అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్తమ్మ అన్నారు. స్థానిక రాజుగారివీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లి పాలు బిడ్డకు శ్రీరామరక్ష అన్నారు. అనంతరం తల్లిపాలను ప్రోత్సహించే పోస్టర్లను ప్రదర్శించి, గర్భిణులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు చంద్రమ్మ, జానీ,స్రవంతి,భవాని,కరీమున్నీషా, ఆదిలక్ష్మి ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన టీచర్లకు సన్మానం



సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

ఉదయగిరి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగళరావునగర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు మంగళవారం పాఠశాలలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవో-1 టీ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమన్నారు. అనంతరం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు షేక్ నూర్జహాన్, కేసీ మాలకొండయ్య, డీ.వెంగళరావు, ఎల్‌పీఎస్ భగవాన్‌శాస్త్రి, షేక్ షబనానిగాహత్, షేక్ రఫీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం రమేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

యాప్‌ల భారం తొలగించండి

ఉదయగిరి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలపై యాప్‌ల భారం అధికమైందని సీఐటీయూ నాయకులు కోడె రమణయ్య ఆరోపించారు. మంగళవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలతో కలిసి ఆందోళన నిర్వహించి, సెల్‌ఫోన్‌లు వద్దని నినదించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేసిన సెల్‌ఫోన్‌లు పనిచేయక కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యకర్తలకు యాప్‌ల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం సెల్‌ఫోన్‌లను సీడీపీవోకు అప్పగించారు.

గ్రామాల్లో గళ్ల పరీక్షలు చేయండి



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ ఖాదర్‌వలి

ఏఎస్ పేట,ఆగస్టు5(ఆంధ్ర జ్యోతి): గ్రామాల్లో ఇంటింటికి తిరిగి రెండు వారాల కంటే ఎక్కువరోజులు దగ్గు ఉన్న వారిని గుర్తించి, గళ్ల పరీక్షలు చేయాలని డీఎల్‌ఏటీవో డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు.మంగళవారం ఆయన చిరమన పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా గర్భిణులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు.పలు రికార్డులు పరిశీలించారు.ఆశా డే కార్యక్రమన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యోతిరాణి, పీహెచ్‌ఎన్ సుబ్బలక్ష్మి,హెచ్‌ఈవో షఫీ,హెచ్‌వీ రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువల ఆక్రమణ

వింజమూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో నేతాజీ స్కూల్‌కు వెళ్లే రోడ్డులో డ్రైనేజీ కాలువలో మురికినీరు పోయే దారిలేక నిలిచిపోయింది. దీనికి కారణం పంట కాలువ ఆక్రమణ. వింజమూరు బంగ్లా సెంటర్లలో చెరువు కాలువగా ఉన్న పంటకాలువ ప్రస్తుతం ఆక్రమణలకు గురై పిల్ల కాలువలా తయారైంది. పట్టణం విస్తరిస్తూ పొలాలు ప్లాట్లుగా విభజించి ఇళ్లు విస్తరిస్తూ ఉంటూ ఉంటుండగా పంట ఆక్రమించినందున మురికి నీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. పాతూరు చెరువు దగ్గర నుంచి గంగమిట్ట ప్రాంతానికి వెళ్లవలసిన ఈ పంట కాలువ మధ్యలోనే ఆగిపోయింది. దీంతో కాలువకు చేరవలసిన మురికి నీరు మధ్యలోనే ఆగిపోయి చుట్టపక్కల ప్రజలకు అసౌకర్యాన్ని కలిగిస్తుంది.

CRIME NEWS

ఉదయగిరిలో రెండిళ్లలో చోరీ

● రూ.80 వేల నగదు, ఆభరణాల అపహరణ



వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ

ఉదయగిరి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అగ్రహారం వీధి, కరీమా వీధి లో రెండిళ్లలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడ్డారు. రూ.80 వేల నగదు, బంగారం, వెండి ఆభరణాలను అపహరించుకుపోయారు. ఈ విషయం మంగళవారం వెలుగుచూసింది. పోలీసుల కథనం మేరకు, అగ్రహారంవీధికి చెందిన షేక్ అబ్దుల్‌షరీఫ్ కుటుంబ సభ్యులతో కలిసి గత శుక్రవారం అరుళ్లలో జరిగే గంధోత్సవానికి వెళ్లారు. మంగళ వారం ఇంటికి చేరుకోగా ప్రధాన ద్వారం తాళాలు ధ్వంసం చేసి ఉండటాన్ని గుర్తించారు. లోపలికి వెళ్లి పరిశీలించగా ఇంట్లో ఉన్న నాలుగు బీరువాల తాళాలు తీసి అందులో ఉన్న రూ.70 వేల నగదు, నాలుగు బంగారు గాజులు, ఐదు ఉంగరాలు, వెండి వస్తువులను చోరీ చేశారు. అలాగే కరీమావీధికి చెందిన షేక్ హుస్సేనీ కుటుంబం హైదరాబాదులో ఉంటున్నది. వారి ఇంటిలో సైతం ప్రధానద్వారం తాళాలు ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించి రూ.10 వేల నగదు, వెండి వస్తువులను అపహరించుకెళ్లారు. సమాచారాన్ని పోలీసులకు అందజేయడంతో ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సిబ్బందితో వెళ్లి వివరాలు సేకరించారు. అనంతరం క్లూస్‌టీం వేలిముద్రలను సేకరించారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

● తాళాలు వేసి ఉన్న ఇళ్లే లక్ష్యం

ఉదయగిరిలో వారం రోజులుగా తాళాలు వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడుతున్నారు. ఈ చోరీలు పోలీసులకు సవాల్‌గా మారాయి. ఆయా నివాసాల్లో జరిగిన చోరీలన్నీ ఒకే మాదిరిగా ఉండడంతో పోలీసులు ఆదిశగా దర్యాప్తు చేస్తున్నారు. వరుస చోరీలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కాగా కొందరు తమ వద్ద ఉన్న బంగారు నగలు, నగదు లాకర్లలో ఉంచేందుకు బ్యాంకులకు పరుగులు తీస్తున్నారు.

ఆటో బోల్తా : దంపతులకు గాయాలు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక శీతల గిడ్డంగి సమీపంలో మంగళవారం ఆటో బోల్తా పడడంతో దంపతులు గాయపడ్డారు. సేకరించిన వివరాల మేరకు, ఏఎస్ పేట మండలం రాజోలుకి చెందిన కొండయ్య ప్రకాశం జిల్లా కనిగిరి నుంచి ఆటోలో స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. జాతీయ రహదారిపై వెళ్తున్న ఆటో ఒక్కసారిగా అదుపు తప్పి బోల్తా పడడంతో కొండయ్య, ఆయన భార్య కల్పన గాయపడ్డారు. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఉదయ గిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

పోలీసు నిఘాలో వరికుంటపాడు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ పరిధి జంగంరెడ్డిపల్లి సమీపంలోని కొండ ప్రాంతం లో తెల్లరాయి తవ్వకాల అనుమతులను రద్దు చేయాలని కొంత కాలంగా ఐదు గ్రామాల ప్రజలు ఆందోళనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు వారిపై ఉక్కుపాదం మోపారు. దీంతో ఆందోళన కారులతో సహా ప్రజలు సైతం న్యాయబద్ధంగా చేస్తున్న పోరాటాలకు ఇన్ని ఆంక్షలా.. అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం కూడా పోలీసులు అదే పంథా కొనసాగించారు. ఆందోళనలో భాగంగా తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి తమ ఆవేదనను లిఖితపూర్వకంగా నివేదిక అందించాలనే సంకల్పంతో ఆందోళన కారులు ఉన్నారనే సమాచారంతో పోలీసులు ఉదయం నుంచి బస్టాండ్ సెంటర్‌లో పహారా కాశారు. దీంతో ఆందోళనకారులు నివాసాలకే పరిమితమయ్యారు. గుండెపోటుకు గురైన పీరయ్య ఆరోగ్య పరిస్థితి కొంత కుదుటపడడంతో వైద్యశాలకు నుంచి ఇంటికి తరలించారు.

25 కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ

నెల్లూరు (క్రైం), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : గంజాయి రవాణ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో ప్రత్యేక బృందం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 25 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుల వివరాలను రైల్వే డీఎస్పీ మురళీధర్ మంగళవారం ఆయన కార్యాలయంలో విలేకర్లకు వెల్లడించారు. గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే క్రమంలో జీఆర్‌పీఎస్, ఆర్‌పీఎఫ్, స్థానిక పోలీసులు, ఈగల్ టీమ్ సంయుక్తంగా ప్రత్యేక బృందంగా ఏర్పడి రైల్వే స్టేషన్లు, రైళ్లలో విస్తృత తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ నేతృత్వంలో సిబ్బంది తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి బ్యాగులను తనిఖీ చేయగా 25 కేజీల గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. వారిని రైల్వే పోలీసు స్టేషన్‌కు తరలించి విచారించగా రాజస్థాన్ రాష్ట్రం జాలోర్ జిల్లాకు చెందిన భగీరథ్, రాహుల్ కుమార్‌గా చెప్పారు. ఒడిశా నుంచి రాజస్థాన్‌కు గంజాయి తరలిస్తూ రైలు మారేందుకు నెల్లూరులో దిగినట్లు తెలిపారు. రైల్వే సీఐ సుధాకర్, సంతపేట ఇన్‌స్పెక్టర్ దశరథరామయ్య పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

నెల్లూరు(క్రైం), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని జీవీఆర్ఆర్ కళాశాల ఎదురుగా ఉన్న ఖాన్ ప్రాపర్టీస్ కార్యాలయంలో ఈ నెల 2వ తేదీ చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను వేదాయపాళెం పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. స్టేషన్‌లో నిందితుల వివరాలను ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు మీడియాకు తెలిపారు. ఖాన్ ప్రాపర్టీస్ కార్యాలయంలో సుమారు రూ.1.50 లక్షల విలువ చేసే 50 గ్రాముల బంగారు నగలు, రూ.50 వేల నగదును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బాధితుల ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతికత ఆధారంగా దర్యాప్తు చేశారు. నిందితులు కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డుకు చెందిన పఠాన్ అష్రఫ్ ఖాన్, మరో బాలుడని గుర్తించారు. గొలగమూడి క్రాస్ రోడ్డు వద్ద వారిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 50 గ్రాముల బంగారు నగలు, ఓ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఐలు జీ నవీన్, సాయి కల్యాణ్, సిబ్బందిని నగర డీఎస్పీ సింధుప్రియ ప్రత్యేకంగా అభినందించారు.

ఆటోలో రూ. లక్ష నగదు మాయం

నెల్లూరు(క్రైం), ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఆటోలో ఓ మహిళ బ్యాగులోని నగదు మాయమైన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరులోని హరనాథపురానికి చెందిన వరలక్ష్మీదేవికి రాజరాజేశ్వరి గుడి ప్రాంతానికి చెందిన పద్మ రూ.లక్ష నగదు ఇవ్వాల్సి ఉంది. వరలక్ష్మీదేవి గత నెల 21వ తేదీన గుడి వద్దకు వెళ్లగా పద్మ నగదు ఇచ్చింది. దానిని బ్యాగ్‌లో పెట్టుకొని ఆటోలో బయలుదేరింది. కొద్ది దూరం వెళ్లాక ఇద్దరు వ్యక్తులు అదే ఆటో ఎక్కారు. వరలక్ష్మీదేవి ఇంటికి వెళ్లిన తర్వాత బ్యాగ్‌ను తెరవగా అందులో ఉండాల్సిన నగదు కన్పించలేదు. దీనిపై బాధితురాలు మంగళవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనతో పాటు ప్రయాణించిన ఇద్దరు వ్యక్తులే నగదు చోరీ చేసి ఉంటారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	107
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	222

కోడిగుడ్ల ధర (100): 475

చెరువులో చేపల వేటకు అనుమతి తీసుకోవాలి

కొండాపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిపేట చెరువులో చేపలు పట్టుకునేందుకు గడువు పూర్తయినందున మత్స్యకార సొసైటీ అనుమతి తీసుకోవాలని మత్స్యశాఖ ఏడీ శ్రీనివాసరాజు తెలిపారు. మంగళవారం సొసైటీ చైర్మన్ కనకయ్య సొసైటీ సభ్యుల సహకారంతో చేపలు పట్టి విక్రయించేందుకు సిద్ధమవ్వగా 127 మంది సభ్యులున్న సొసైటీలోని ముగ్గురు వ్యక్తులు సొసైటీలో అక్రమాలు జరుగుతున్నాయని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు చెరువవద్దకు వచ్చి సభ్యులను విచారించారు. చేపలు పట్టుకునేందుకు జూన్ నెలాఖరుకు గడువు పూర్తయిందని అధికారులు తెలియచేయగా చెరువులో నీరు ఎక్కువగా ఉండటంతో చేపలు పట్టలేకపోయామని చైర్మన్ వారికి తెలియచేశారు. మత్స్యకారశాఖ అధికారుల అనుమతి తీసుకొని చేపలు పట్టుకోవాలన్నారు.

న్యూస్ బాక్స్

212 పొగాకు బేళ్లు కొనుగోలు

కలిగిరి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం రైతులు మొత్తం 331 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 212 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-96, ఆర్ఆర్-2, సీఆర్-16, జంపింగ్ లాట్స్-5 కారణాలతో 119 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ.226.79గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

అంగన్‌వాడీ వర్కర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బిట్రగుంట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో అంగన్వాడీ కార్యకర్త, సహాయకుల ఖాళీల భర్తీకి ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని కావలి ఐసీడీఎస్ సీడీపీవో సౌజన్య మంగళవారం తెలిపారు. సీఆర్ పాలెం మెయిన్‌లో కార్యకర్త, రామస్వామి పాలెం-2లో ఎస్టీ, నాగులవరం ఎస్టీ, కప్పరాళ్లతిప్ప 1 - 2 ఎస్టీలు, కమ్మపాలెం - 2 ఎస్సీ, పాతబిట్రగుంట -1 బీసీ(బీ), సీఆర్ పాలెం హెచ్‌డబ్ల్యూ సెంటర్ల ఓసీ, బేతనీపేట ఎస్సీలకు కేటాయించిన సహాయకుల పోస్టులు ఖాళీలు ఉన్నాయన్నారు. అలాగే దగదర్తి మండలం పెద్దపుత్తేడు -1 ఎస్సీ, 2 ఓసీ, చౌటపుత్తేడు బీసీ(డి), కాట్రాయపాడు మెయిన్ ఓసీ ఆయా పోస్టులు ఖాళీలు ఉన్నాయిని ఆమె తెలిపారు.

పీహెచ్‌సీని సందర్శించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో

గుడ్లూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): గుడ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కందుకూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో పీ.పద్మజ మంగళవారం సందర్శించారు. ఆశా కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈనెల 12న జరిగే జాతీయ నులిపురుగుల నివారణ దినాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఎల్.సాయి ప్రియాంక, రమ్య, సీహెచ్‌వో శ్రీనివాసులు పాల్గొన్నారు.

దళిత కుటుంబాలపై దాడి అమానుషం

బిట్రగుంట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): దళిత కుటుంబాలపై మూకుమ్మడి దాడి అమానుషమని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లుసాల్మన్‌రాజు అన్నారు. బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ తెల్లగుంట దళితవాడపై ఇటీవల జరిగిన దాడిని మంగళవారం ఆయన ఖండించారు. గ్రామానికి వెళ్లి బాధితులతో మాట్లాడారు. మూకుమ్మడి దాడిపై పోలీసులు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. అనంతరం గ్రామంలోని బాధజతలతో కలసి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది గడ్డం అంబేడ్కర్, నాయకులు పొంగలూరు ప్రసాద్, బొంగులూరు సుధాకర్, దానం మాల్యాద్రి, గంగపట్నం సతీష్, ఏంబేటి శ్రీనివాసులు, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోవూరు రోడ్డు జనార్దనకాలనీ ఫీడర్‌లో లైనుకు తగిలే చెట్ల కొమ్మలు తొలగించుటకు బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈ టీవీ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. జనార్దనకాలనీ, పుట్ట ఏరియా, ఎర్రగుంటపాలెం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

బిట్రగుంట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం చెంచులక్ష్మీపురంకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఆంధ్ర బుద్ధయ్య సతీమణి తెళ్ల మేరీ శ్రీవాణి అనారోగ్యంతో సోమవారం మృతి చెందగా మంగళవారం ఆ కుటుంబాన్ని పలువురు పరామర్శించారు. టీడీపీ మండల కన్వీనర్ ఎం.నాగేశ్వరరావు, నాయకులు ఎల్.సుధీర్‌బాబు, సీహెచ్ వెంకటేశ్వర్లు, బీ.ప్రభాకర్, యోహాన్, బీజేపీ నేత ఎస్ఎస్ యాదవ్, ఎంఆర్‌పీఎస్ నేత జీ.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ' రాకుంటే వీఏఏలను కలవండి

లింగసముద్రం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : మండలంలో అన్నదాత సుఖీభవ డబ్బులు వివిధ కారణాల చేత రాని రైతులు వెంటనే రైతు సేవా కేంద్రాలలో వీఏఏలను కలవాలని పొలం పిలుస్తోంది మండల ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారి కె హర్షవర్ధన్ చెప్పారు. మంగళవారం మండలంలోని వీఆర్ కోట, అన్నెబోయినపల్లిలో ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్ఏ రాజశేఖర్ పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం

బిట్రగుంట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు అమృతం అని కావలి ఐసీడీఎస్ సీడీపీవో సౌజన్య అన్నారు. బోగోలు మండలం కప్పరాళ్లతిప్పలోని 1, 2 మెర్గి అంగన్వాడీల్లో ప్రపంచ తల్లిపాల వారోత్సవల కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వీ.హైమావతి, ఎంఎస్‌కే షేక్.బాబీజాన్ పాల్గొన్నారు.

'రాళ్లపాడు' కట్టలకు మహర్దశ!

- 20 ఏళ్ల తర్వాత అభివృద్ధి
- బ్రాంచి కాలువల పనులూ పూర్తి
- ఆనందంలో రైతాంగం



రాళ్లపాడు కుడి కాలువ కట్టపై వేసిన గ్రావెల్

లింగసముద్రం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : రెండు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని రాళ్లపాడు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలు, బ్రాంచి కాలువల కట్టలపై రోడ్డు అభివృద్ధి పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. దీంతో ప్రాజెక్టు ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 20 ఏళ్ల నుంచి ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలు, బ్రాంచి కాలువల కట్టలపై పిచ్చి మొక్కలు, చిల్లచెట్లు ఏపుగా పెరిగి మనిషి తిరగలేని విధంగా మూసుకుపోయాయి. దీనికి తోడు కట్టలపై అడుగడుగున గుంతలు, మిట్టలతో తయారవడంతో ఈ కట్టలపై ట్రాక్టర్లతో పొలాలకు వెళ్లి వ్యవసాయ పనులు చేసుకొనేందుకు, పంట ఉత్పత్తులను ఇంటికి తెచ్చుకొనేందుకు రైతులు నానా అగచాట్లు పడేవారు. అలాగే ప్రాజెక్టు వద్ద జరిగే సమావేశాలకు, పొలాలకు నీటి సరఫరాను పర్యవేక్షణకు కార్లు, ఇతర వాహనాలలో ప్రాజెక్టు అధికారులు, సిబ్బంది, రైతులు రాకపోకలు సాగించేందుకు కూడా అనేక ఇబ్బందులు పడ్డారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయకట్టు కమిటీ ప్రతినిధులు, రైతులు ఈ కాలువల కట్టల రోడ్ల పరిస్థితిని, ప్రాజెక్టులోని ఇతర సమస్యలను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లడంతో ప్రాజెక్టులోని సమస్యల పరిష్కారానికి ఆయన అధికారులతో చర్చించారు. యుద్ధప్రాతిపదికన రూ.3 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేయించి ప్రభుత్వానికి పంపించారు. దీంతో ప్రభుత్వం కాలువల కట్టలపై రోడ్ల అభివృద్ధికి రూ.75 లక్షలు మంజూరు చేసింది. దీంతో అధికారులు ఈ పనులను మూడు వారాల క్రితం కాంట్రాక్టర్లకు అప్పగించి పనులు ప్రారంభింపచేశారు. చేపట్టిన పనులు శరవేగంగా చేసి వారం రోజుల క్రితం పూర్తి చేయించారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.75 లక్షలతో సుమారు 21 కి.మీ పొడవున ఉన్న ప్రాజెక్టు కుడి కాలువ కట్ట రోడ్డుతో పాటు వెంకటపేట, జంగాలపల్లి, సీతారాంపురం బ్రాంచి కాలువల కట్టల రోడ్ల అభివృద్ధి పనులను రూ.67.10 లక్షలతో పూర్తి చేశారు. అలాగే 3 కి.మీ పొడవున ఉన్న ఎడమ కాలువ కట్ట రోడ్డును కూడా కట్ట రోడ్డు బాగులేని దగ్గర రూ.5.20 లక్షలతో అభివృద్ధి చేశారు. ఇక మిగిలిన రూ.2.70 లక్షలతో ప్రాజెక్టు కట్టకు ఇరువైపులా ఉన్న చిల్లచెట్లను తొలగించేందుకు కేటయించారు. అయితే ఈ చిల్లచెట్లను తొలగించేందుకు గుత్తేదారులు ఎవరూ ముందు రావడం లేదు. దీంతో ఈ జంగిల్ క్లియరెన్స్ పనులు నిలిచిపోయాయి. పూర్తయిన పనులను క్వాలిటీ కంట్రోల్ అధికారులు నాలుగైదు రోజుల క్రితం తనిఖీ చేశారు. దీంతో ఈ కట్టలపై ప్రస్తుతం వాహనాల రాకపోకలకు, రైతులు పొలాలకు వెళ్లి వచేందుకు ఎంతో అనువుగా మారాయి. కట్టల అభివృద్ధిపై తక్షణం స్పందించి నిధులు మంజూరు చేయించడమే కాకుండా శరవేగంగా పనులు పూర్తి చేయించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు రైతులు కృతజ్ఞలు తెలిపారు.



పూర్తయిన ఎడమ కాలువ రోడ్డు అభివృద్ధి పనులు

కందుకూరులో కుక్కల స్వైరవిహారం

- చిన్నారిపై మూకుమ్మడి దాడి

కందుకూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుల్తాన్‌మొహిద్దీన్ నగర్‌లో మంగళవారం వీధి కుక్కలు స్వైరవిహారం చేశాయి. వీధిలో ఆడుకుంటున్న ఓ చిన్నారిపై ఐదు కుక్కల గుంపు మూకుమ్మడిగా దాడి చేసి గాయపరిచాయి. స్థానికులు గమనించి వెంబడించటంతో కుక్కలు పరారవగా గాయపడిన చిన్నారిని చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. గత కొన్ని రోజులుగా కుక్కలు గుంపులు గుంపులుగా ప్రజలపై దాడి చేస్తున్నాయి. ఇటీవల కాలంలో పలు సందర్భాలలో బజార్లలో ఆడుకుంటున్న చిన్నారులపై కుక్కలు దాడి చేశాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

దోమల నివారణకు చర్యలు



ఫాగింగ్ చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కావలి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రోజు రోజుకు పెరుగుతున్న దోమల నివారణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. మంగళవారం పట్టణంలోని అనేక వార్డులలో ఫాగింగ్, స్ప్రేయింగ్ చేశారు. 2, 13, 32, 18 వార్డుల్లో ఫాగింగ్, 2, 17, 33 వార్డులలో డ్రైనేజీ కాలువల్లో దోమల నివారణ మందు స్ప్రేయింగ్ చేశారు. పట్టణంలో అన్ని వార్డులలో ఒక టీమ్‌వర్క్‌గా ఈ కార్యక్రమం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళల ఉచిత ప్రయాణం సమర్థవంతంగా నిర్వహించాలి : డీఎం



మహిళా కండక్టర్‌కు నగదు బహుమతి అందచేస్తున్న డీఎం ఆదినారాయణ

కావలి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15 నుంచి ప్రారంభించనున్న మహిళల ఉచిత ప్రయాణ పథకం విజయవంతం చేయడానికి ప్రతి ఉద్యోగి కృషి చేయాలని ఆర్టీసీ కావలి డిపో మేనేజరు డీ.ఆదినారాయణ తెలిపారు. మహిళా ప్రయాణీకుల రద్దీని తట్టుకునే విధంగా మెకానిక్‌లు బస్సులను సిద్ధం చేస్తున్నారని చెప్పారు. కావలి ఆర్టీసీ గ్యారేజి నందు మంగళవారం ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమంలో జూలై మాసంలో తమకు కేటాయించిన లక్ష్యాన్ని అధిగమించి 115 శాతం సాధించిన సీహెచ్ విజయకుమారి, 108 శాతం సాధించిన ఎం.రాజశేఖర్, 105 శాతం సాధించిన కేవీ శేషమ్మలకు డిపో మేనేజరు నగదు బహుమతులను అందచేశారు. ప్రతి ఉద్యోగి వీరిని ఆదర్శంగా తీసుకుని సంస్థ ఆదాయం పెంపుదలకు కృషి చేయాలన్నారు. అదే విధంగా డ్రైవర్లు ఇంధన పొదుపునకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు ట్రాఫిక్ ఎం.కల్పన, అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్‌కే ఖాజా మొహిద్దీన్, ట్రాఫిక్ సూపరింటెండెంట్ రామకృష్ణ, సిస్టం సూపర్‌వైజర్ శివశంకర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీరు, పౌష్టికాహార లోపంతో 'ఫ్లోరోసిస్'

- రాష్ట్ర ఫ్లోరోసిస్ కన్సల్‌టెంట్ డాక్టర్ దివ్య

కావలి రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కలుషిత నీరు, పౌష్టికాహార లోపమే ఫ్లోరోసిస్‌కు కారణమని రాష్ట్ర ఫ్లోరోసిస్ కన్సల్‌టెంట్ డాక్టర్ దివ్య పేర్కొన్నారు. మండలంలోని తుమ్మలపెంట, సర్వాయపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలోని తుమ్మలపెంట, మోర్లవారిపాలెం, కొత్తపల్లి, సిరిపురం గ్రామాల్లో పాఠశాలల్లో విద్యార్థులకు మంగళవారం ఫ్లోరోసిస్ వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పళ్లు వంకర్లు పోవడం, ఎముకలు పటిష్ఠం లేకుండా వంగిపోవటం ఫ్లోరోసిస్ లక్షణాలన్నారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో పాటు సర్వాయపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్వాయపాలెం, తుమ్మలపెంట పీహెచ్‌సీల వైద్యులు ప్రతిమ, శ్రీనివాసులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



పాఠశాలలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ దివ్య

నేతల నైజం ప్రజలకు శాపం

- ప్రతిపక్షంలో ఒకలా.. అధికారంలో మరోలా మాట్లాడుతున్నారు
- స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్ చార్జీలపై వామపక్షాల ధర్నా



ధర్నా చేస్తున్న వామపక్ష పార్టీల నేతలు

కావలి(టౌన్), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): అధికారం కోసం నేతల నైజం ప్రజలకు శాపంగా మారుతోందని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా.. అధికారమొచ్చాక మరోలా మాట్లాడడం అలవాటుగా మారిందని వామపక్ష పార్టీల నేతలు ధ్వజమెత్తారు. స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్ చార్జీలను నిరశిస్తూ మంగళవారం వెంగళరావునగర్‌లోని విద్యుత్ ఈఈ కార్యాలయం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్లకు స్మార్ట్ మీటర్ల బిగింపు, ట్రూఅప్ చార్జీల పేరుతో పేద, మధ్య తరగతి ప్రజలను దోచుకొంటున్నారన్నారు. ప్రజలు అప్రమత్తమై ప్రశ్నించకపోతే ప్రతినెలా అదనపు భారం మోయకతప్పదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రభుత్వమే నిర్వహించాలని, అదాని అంబానీలకు లాభం చేకూర్చేందుకు అప్పజెప్పడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. వైసీపీ ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లకు, ట్రూఅప్ చార్జీలకు వ్యతిరేకంగా ధర్నాలు నిర్వహించి గళమెత్తిన కూటమి నేతలు ఇప్పుడెందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల బిగింపు మానుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమం తప్పదని హెచ్చరించారు. అనంతరం ఈఈ బెనర్జికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నేతలు పీ.పెంచలయ్య, మధుసూదన్ రావు, కృష్ణమోహన్, నరసింహారెడ్డి, ఎల్.శ్యామల, పీ.తిరుపాలు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సమావేశం

ఉలవపాడు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ వాయల మస్తానమ్మ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా జరిగింది. ఉద్యానవన, మత్స్యశాఖ, విద్యుత్, ఫారెస్టు శాఖల అధికారులు గైరు హాజరయ్యారు. హాజరు కానీ మండల శాఖాధిపతులపై తగిన చర్యలు తీసుకోవాలని సమావేశానికి హాజరైన సభ్యులు ఎంపీడీవో సురేష్‌ను కోరగా వారందరికి షోకాజ్ నోటీసులు జారీ చేసి తగిన వివరణ అనంతరం ఉన్నతాధికారులకు నివేదిస్తానని చెప్పారు. కాగా ఉలవపాడు నుంచి వీరేపల్లి మోడల్ స్కూల్‌కు విద్యార్థులను ఉచితంగా తీసుకెళ్లే ఆర్టీసీ బస్సు నిలిపేశారని, విద్యార్థులు వీరేపల్లి స్కూల్‌కి వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారని ఎంఈవో-2 రమణయ్య దృష్టికి తీసుకుపోగా అక్కడే ఉన్న ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. ఉలవపాడు సీహెచ్‌సీలో డాక్టర్లు, సిబ్బంది ప్రజలకు సక్రమంగా సేవలు అందించడం లేదని ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని సభ్యులు డాక్టర్ ఐశ్వర్యను ప్రశ్నించారు. ఉలవపాడులో నీటి ఎద్దడి ఉందని ఎన్నిసార్లు పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు తెలియచేసినా పట్టించుకోవడం లేదని సభ్యులు నిలతీశారు.



మాట్లాడుతున్న సీహెచ్‌సీ డాక్టర్ ఐశ్వర్య

వాట్సాప్ గుడ్ గవర్నెన్స్ సేవలు పొందండి

అల్లూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాట్సాప్ మనమిత్ర గుడ్ గవర్నెన్స్ సేవలను సులభతరంగా పొందవచ్చని నగర పంచాయతీ కమిషనర్ ఉమామహేశ్వరరావు అన్నారు. అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని పట్టణంలోని నాలుగు సచివాలయాలు, నార్తుమోపూరు, సింగపేట ప్రాంతాల్లో మంగళవారం స్థానిక నాయకులు, సచివాలయాల సిబ్బందితో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించి వాట్సాప్ గుడ్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాట్సాప్ మనమిత్ర ద్వారా అన్ని శాఖల్లో 539 సేవలను పొందే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా ప్రజలతో మమేకమై ఈ సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ డీఈవో వరప్రసాద్, నాయకులు కృష్ణచైతన్య, బండి శ్రీనివాసులురెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, జగన్, పాశం దయాకర్, నజీర్‌బాషా, ఖదీర్, బిట్రగుంట చైతన్యరెడ్డి, జగదీష్‌రెడ్డి, ఇస్మాయిల్ పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ ఉమామహేశ్వరరావు

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు కరేడు విద్యార్థుల ఎంపిక

ఉలవపాడు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాల్‌బాడ్మింటన్ క్రీడలకు కరేడు విద్యార్థులు ఎంపికయ్యారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా బాల్‌బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాల్‌బాడ్మింటన్ జూనియర్, సబ్ జూనియర్ బాలబాలికల ఎంపికలు గుడ్లూరు మండలం చేవూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగాయి. ఈ ఎంపికల్లో కరేడు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ప్రతిభచాటి రాష్ట్రస్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. కంబోతు గాయత్రి, హృదయ సందేశ్ జూనియర్ టీమ్‌కు, దొడ్ల యోషితారెడ్డి, నిహాల్, ఉపదేశ్ సబ్ జూనియర్స్ టీమ్‌కు ఎంపికైనట్లు తెలిపారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం

కొండాపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని వింజమూరు సీడీపీవో పద్మజ పేర్కొన్నారు. మంగళవారం కొమ్మి అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఐసీడీఎస్ ద్వారా గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందచేసే పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. పౌష్టికాహారం ద్వారా తల్లికి, శిశువులకు ఆరోగ్యం మెరుగవుతుందన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహారం అందచేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుహాసిని, ఎంఎస్‌కే క్రైటాన్, స్థానిక ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మాధవి, అంగన్‌వాడీలు కేవీ.అరుణ, దొరసాని, రమాదేవి, ఆదిలక్ష్మి, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి పైపులైన్‌కు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పగిలిన పైపును తొలగించి కొత్త పైపు వేస్తున్న సిబ్బంది

లింగసముద్రం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : లింగసముద్రంలోని మీసేవా కేంద్ర పగిలిన అంతర్గత మంచినీటి పైపులైన్‌ను తొలగించి, కొత్త పైపు వేశారు. ఈ నెల 1వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'మంచినీటి పైపులైన్ పగిలి నిలిచిన నీటి సరఫరా' వార్తకు మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్ స్పందించారు. మంగళవారం ఆయన మంచినీటి పథకం సిబ్బందితో ఎక్స్‌కవేటర్ ద్వారా పగిలిన మంచినీటి పైపును తొలగించి, కొత్త పైపు వేయించి నీటి సరఫరా చేయించారు.

బ్యాటరీ ట్రైసైకిల్ పంపిణీ



దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందజేస్తున్న సబ్ కలెక్టరు శ్రీపూజ

కందుకూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లెలమూడికి చెందిన దివ్యాంగుడు మణిభూషణాచారికి సక్షమ్ ద్వారా మంజూరైన బ్యాటరీ ట్రైసైకిల్‌ను కందుకూరు సబ్ కలెక్టరు తిరుమాణి శ్రీపూజ మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సక్షమ్ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు చెన్నా రామాంజనేయులు, ముప్పల సతీష్, చక్కా కేశవ, గుర్రం అల్లూరయ్య, కోట నరసింహం, బొగ్గవరపు ప్రసాద్, ఇస్కాల సురేంద్ర, రంగనాయకులు, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు, అధ్యాపకుల రక్తదానం



రక్తదానం చేస్తున్న నర్సింగ్, ఫిజియోథెరపీ విద్యార్థులు, అధ్యాపకులు

కావలి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కావలి రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నర్సింగ్, ఫిజియోథెరపీ విద్యార్థులు, అధ్యాపకులు రక్తదానం చేశారు. పట్టణంలోని పాతూరులోని శ్రీలక్ష్మి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాలలో జరిగిన ఈ రక్తదాన శిబిరంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కే.మాధవరెడ్డి 47వ సారి రక్తదానం చేశారు. కళాశాల నిర్వాహకులు డాక్టర్ ఆనందకుమార్, డాక్టర్ గోపీ కన్నన్ శిబిరాన్ని పర్యవేక్షించారు. ప్రముఖ సివిల్ ఇంజనీర్ రక్తదాతలకు పండ్లరసాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ కార్యదర్శి రమేష్‌రెడ్డి, సభ్యులు కొండలరావు, గోపీకృష్ణ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు హరినారపరెడ్డి, ప్రసన్నకుమార్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అజిత్‌రెడ్డికి వైసీపీతో సంబంధం లేదు

కందుకూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో అరెస్టు అయిన నల్లపరెడ్డి అజిత్‌రెడ్డికి వైసీపీ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని ఆపార్టీ నాయకులు నన్నం పోతురాజు, ముప్పవరపు కిషోర్, వెలిచర్ల ధనకోటి, పాలవల్లి అమరనాథరెడ్డి, మద్దసాని నవీన్‌కృష్ణ స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ గత ఎన్నికల్లో అజిత్‌రెడ్డి టీడీపీ ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి, ఆపార్టీ అభ్యర్థులకు మద్దతుగా శక్తివంచన లేకుండా పనిచేశారన్నది బహిరంగ రహస్యమని తెలిపారు. అజిత్‌రెడ్డి ఎన్నికల తర్వాత కూడా నేటి వరకు ఎన్నడూ వైసీపీ కార్యక్రమాలలో పాల్గొనలేదని, నియోజకవర్గ వైసీపీ ఇంఛార్జిగా ఉన్న బుర్రా మధుసూదన్‌యాదవ్‌ను కూడా ఇప్పటివరకు కలవలేదన్నారు.

ఇనుప ఖనిజాన్ని జిందాల్ కంపెనీకి ఇవ్వద్దు



యర్రారెడ్డిపాలెం కొండప్రాంతంలో ఇనుప ఖనిజంను పరిశీలిస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు

లింగసముద్రం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : లింగసముద్రం, వలేటివారిపాలెం మండలాల్లో లభ్యమయ్యే ఇనుప ఖనిజాన్ని జిందాల్ కంపెనీకి ఇవ్వద్దని సీపీఎం, సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం గుడ్లూరు ప్రాంతీయ కమిటీ కన్వీనర్ జీ.వెంకటేశ్వర్లు, సీపీఐ కందుకూరు నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్‌బాబు ఆ పార్టీల నాయకులు మండలంలోని యర్రారెడ్డిపాలెం గ్రామ సమీపంలో జరుగుతున్న ఇనుప ఖనిజ తవ్వకాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వమే ఇనుప ఖనిజ నిక్షేపాలను వెలికితీసి, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి తరలించాలని డిమాండ్ చేశారు. అనంతరం యర్రారెడ్డిపాలెం గ్రామంలోని కొందరు రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు దువ్వూరు జాన్, నత్తా రామారావు, రైతులు వి.రామకృష్ణారెడ్డి, హనుమంతరావు, ఉట్లపల్లి లక్ష్మీనారాయణ, వింజమూరి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

13న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రాక



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

కావలి(టౌన్), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : బీజేపీ పటిష్ఠత కోసమే రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ జిల్లాకు రానున్నారని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు మంద కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నేతలు మాట్లాడుతూ ఈనెల 13న నెల్లూరులో జరిగే సారధ్యం సభను, రాష్ట్ర అధ్యక్షుడు పర్యటనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ప్రతినెలా చివరి ఆదివారం పట్టణంలోని ప్రతి బూత్‌లో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు బ్రహ్మానందం, వీవీ రంగారెడ్డి, పరుసు వెంకటేశ్వర్లు, పూనూరు మాధవి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రుయా సమీపంలో ఇలా

మనసున్న మారాజుకు మానవీయ స్పందన

తమ్ముడూ... బేగొచ్చెయ్..!



- విజయనగరం ఎంపీ, తిరుపతి పోలీసుల సహకారంతో అక్క వద్దకు తరలివెళ్లిన నెల్లిమర్ల వాసి
- సామాజిక సేవకురాలు సుజాతకు ప్రశంసలు
- అక్కా తమ్ముళ్లను కలిపిన ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): 'తమ్ముడూ... బేగొచ్చెయ్..రా..' ఈ ఒక్క మాటతో ఆమె గొంతు పొలమారింది. దుఃఖం ఎగదన్నుకుని వచ్చింది. మొబైల్ ఫోన్‌లో తిరుపతిలోని అలిపిరి వద్ద రోడ్డు పక్కన ఉన్న తమ్ముడిని చూస్తూ వెక్కి వెక్కి ఏడ్చింది. వీడియో కాల్‌లో అక్కను చూస్తూ ఆ తమ్ముడూ దుఃఖసముద్రమే అయ్యాడు. 'అక్కా.. అక్కా..' అన్న మాట తప్ప మరేదీ అతని గొంతులోంచి పెగల్లేదు. ఆ అక్కా తమ్ముళ్ల దుఃఖం చూసినవారంతా కంట తడిపెట్టారు. తమ్ముడిని ఆ స్థితిలో చూడలేక, దుఃఖాన్ని ఆపుకోలేక ఆమె ఫోన్ కట్ చేసేసింది. కాసేపటికి మళ్లీ లైన్‌లోకి వచ్చి 'తమ్ముడూ నాకు చెప్పకుండా ఒక్కడివే తిరపతికి ఎందుకెల్లావ్..?' అని ఏడుస్తూనే కోప్పడింది. 'ఒక్క ఫోన్ చేసివుండొచ్చు కదా' అని నిష్ఠూరాలాడింది. 'నాకేదీ గ్యాపకం లేదక్కా.. నా బ్యాగు, పర్సూ కూడా లేవక్కా.. సుజాత అని ఒక తల్లి నాకు ప్రేణం పోసిందక్కా..' అంటూ అతనూ ఏడుస్తూనే వివరించాడు. తమ్ముడు పడ్డ బాధలు వినే శక్తి బహుశా ఆమెకు లేదేమో.. 'బేగొచ్చెయ్.. తమ్ముడూ.. ఇక ఎక్కడికీ వెళ్లద్దు.. నా దగ్గరే వుండిపోదూ..వచ్చెయ్' అంటూ ఫోన్ పెట్టేసింది.

రుయా నుంచి తరలిస్తున్న అలిపిరి సీఐ రామకిశోర్



నెల్లన్నర కిందట తిరుమలకు దర్శనానికి వచ్చి అన్నదాన సత్రం వద్ద కళ్లతిరిగి పడిపోయిన హార్డ్‌వేర్ ఇంజనీర్ కోరుమల్లి వెంకట్రావు, కదల్లేని స్థితిలో అలిపిరి సమీపంలో రోడ్డుపక్కన పడి వుండిపోయిన తీరును ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకువచ్చింది. 'అక్కా.. వచ్చి నన్ను తీసుకుపో' అంటూ ప్రచురించిన వార్త అక్కా తమ్ముళ్లను చేరువ చేసింది. అలిపిరి అనాథలకు అమ్మలా సేవచేసే సుజాతకు వెంకట్రావు చెప్పిన వివరాల ఆధారంగా ఆంధ్రజ్యోతి నెల్లిమర్ల రిపోర్టర్ సారిపల్లిరోడ్డులోని బృందావన్ వ్యాలీలో విచారించగా అక్క అరుణా పాతక్ ఇల్లు దొరికింది. ఢిల్లీలో ఇంజనీర్లుగా పనిచేసి రిటైరైన ఆమె, ఆమె భర్త ప్రస్తుతం ఇక్కడ ఉంటున్నారు. వెంకట్రావు పెళ్లి చేసుకోలేదు. ఒక్కడే విశాఖపట్టణంలో ఉండేవాడు. నలుగురు అక్కచెల్లెళ్లను తరచూ వెళ్లి కలిసేవాడు. నెలన్నరగా అతని ఫోన్ పలకకపోవడంతో వారు ఎక్కడికైనా వెళ్లి ఉంటాడని అనుకున్నారు. తిరుపతిలో మరుగుదొడ్ల పక్కన ఇటువంటి స్థితిలో ఉంటాడని వారు ఊహించలేదు. ఆంధ్రజ్యోతి సమాచారంతో, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు స్పందనతో ఇప్పుడు తమ్ముడి రాక కోసం నెల్లిమర్లలో ఎదురు చూస్తున్నారు.

కదిలించిన వార్త

ఆంధ్రజ్యోతి వార్తకు విజయనగరం ఎంపీతో పాటూ ఎస్పీ హర్షవర్ధన్‌రాజు స్పందించారు. వివరాలు కనుక్కోమని డీఎస్పీ భక్తవత్సలాన్ని ఆదేశించారు. అలిపిరి సీఐ రామకిశోర్ రంగంలోకి దిగారు. సామాజిక సేవకురాలు సుజాత ద్వారా వెంకట్రావు ఉన్న ప్రదేశానికి ఉదయమే చేరుకున్నారు.వెంటనే రుయాస్పత్రికి తరలించారు.సుజాత అప్పటికే వెంకట్రావును శుభ్రం చేసి, ప్యాంటు చొక్కా వేశారు. వైద్యులు ఆయనకు ప్రాథమిక చికిత్స అందించారు. తన అక్క ఫోన్‌లో మాట్లాడిన తర్వాత వెంకట్రావులో చాలా మార్పు వచ్చింది. ఆరోగ్యంగా, ఉత్సాహంగా కనిపించారు. విజయనగరం ఎంపీ అప్పలనాయుడు ఏర్పాటు చేసిన కారులో, ప్రసాద్ అనే కానిస్టేబుల్ సాయంతో మధ్యాహ్నం 2.20గంటలకు నెల్లిమర్లకు బయలుదేరారు.

నీ వల్లే బతికాను తల్లీ!



రుయాస్పత్రిలో నుంచి వెంకట్రావును బయటకు తీసుకువచ్చి కారులో ఎక్కిస్తున్న సమయంలో ఆయనకు నెలరోజులుగా అన్నంపెట్టి సేవ చేస్తున్న సుజాత కన్నీటి పర్యంతం అయ్యారు. ఆయన కూడా ఆమెను పట్టుకుని ఏడుస్తూ ఉండిపోయారు. 'నాయనా.. దారిలో ఏం తింటావో.. ఈ బిస్కెట్ తిను..' అంటూ ఆమె అతని నోటికి బిస్కెట్ అందించారు. 'నువ్వు నా తల్లివమ్మా.. నువ్వు లేకపోతే ఇక్కడ మిగిలేవాడిని కాదమ్మా' అంటూ వెంకట్రావు ఒక బిస్కెట్ తుంచి సుజాత నోట్లో పెట్టారు. ఆమెతో పాటూ ఇన్ని రోజులుగా అదే పేవ్‌మెంట్ మీద ఉంటున్న అనాథలు కొందరు కూడా వచ్చి ఆయనకు వీడ్కోలు చెప్పారు.



కల్వర్టును ఢీ కొన్న కారు



లేమ (ఫైల్ ఫొటో)

తమ్ముడి పెళ్లికని అమెరికా నుంచి వస్తూ..!

చంద్రగిరి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తమ్ముడి వివాహం. చాలా కాలం తర్వాత సొంతగడ్డకు వస్తున్నామన్న ఆనందం. కుటుంబ సభ్యులు.. బంధుమిత్రులతో సరదాగా గడపొచ్చని భావించారు. అమెరికా నుంచి భర్తతో కలిసి ఇండియా వచ్చారు. మరో అరగంటలో ఇల్లు చేరతామనగా, కుక్క రూపంలో మృత్యువు తరుముకొచ్చింది. కుక్క అడ్డు రావడంతో కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొనడంతో లేమ(34), డ్రైవరు రాజేష్ దుర్మరణం చెందారు. ఆమె భర్త కార్తిక్ గాయాలతో చికిత్స పొందుతున్నారు. ఈ విషాద ఘటన మంగళవారం చంద్రగిరి మండలం మామండూరు వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి కరంబాడి రోడ్డులోని కేఆర్ నగర్‌కు చెందిన కార్తిక్, లేమ దంపతులు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా స్థిరపడ్డారు. ఈనెల 13న లేమ తమ్ముడి వివాహం ఉంది. దీనికోసం వీరు అమెరికా నుంచి బయలుదేరి.. సోమవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో బెంగళూరు విమానాశ్రయానికి చేరుకున్నారు. అద్దె కారులో తిరుపతికి బయలుదేరారు. మంగళవారం వేకువజామునకు మామండూరు వద్ద జాతీయ రహదారిలో వస్తున్న వీరి కారుకు ఓ కుక్క అడ్డంగా వచ్చింది. దీంతో కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న కల్వర్టును ఢీకొంది. బెంగళూరుకు చెందిన కారు డ్రైవర్ రాజేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. బెలూన్ ఓపెన్ అయినా అతడి ప్రాణాలు దక్కలేదు. తీవ్ర గాయాలైన కార్తిక్, లేమను తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. అప్పటికే లేమ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కార్తిక్ చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సందడిగా ఉండాల్సిన పెళ్లింట.. విషాదం నెలకొంది.



డ్రైవర్ రాజేష్(ఫైల్‌ఫొటో)

- మామండూరు వద్ద అదుపుతప్పి కల్వర్టును ఢీకొన్న కారు
- డ్రైవరుతోపాటు ఎన్నారై మహిళ మృతి
- ఆమె భర్తకు తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న కార్తిక్

'ఇన్‌స్పైర్'కు పోటీ పడండి



ఇన్‌స్పైర్ మనక్-2025 పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈవో, జిల్లా సైన్స్ అధికారి తదితరులు

- నామినేషన్లకు సెప్టెంబరు 15 గడువు

తిరుపతి(విద్య), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): 'విద్యార్థులకు సైన్సు, సాంకేతి రంగాలపై ఆసక్తి పెంచి.. శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ఏటా 'ఇన్‌స్పైర్ మనక్' అవార్డులతో ప్రోత్సహిస్తోంది. ఈ అవార్డులకోసం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పోటీ పడాలి' అని డీఈవో కేవీఎన్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ ఏడాది పోటీలకు నామినేషన్లను పంపేందుకు సెప్టెంబరు 15వ తేది తుది గడువన్నారు. జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ తదితరులతో కలిసి మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో 'ఇన్‌స్పైర్ మనక్- 2025' వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రతీ ప్రాథమికోన్నత పాఠశాల నుంచి 3, ఉన్నత పాఠశాల నుంచి 5, ప్లస్ టు పాఠశాలల నుంచి 2 చొప్పున నామినేషన్లు తప్పనిసరిగా పంపించాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సూచించారు. నూతన పాఠశాలలు రిజిస్ట్రేషన్ యూజర్ ఐడీ కోసం జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్‌ను 94405 11983 నెంబరులో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ గౌరీశంకర్, తిరుపతి ఉప విద్యాశాఖాధికారి బాలాజీ, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శివశంకరయ్య, తడ ఏపీ మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్ మోహన్‌రెడ్డి, సెక్టోరియల్ ఆఫీసర్లు సుధాకర్, సారథి పాల్గొన్నారు.

❖ నిబంధనలు అతిక్రమించిన

నలుగురు ఉద్యోగులపై టీటీడీ చర్యలు

- ఇద్దరి సస్పెన్షన్..
  మరో ఇద్దరికి షోకాజ్ నోటీసుల జారీ

తిరుమల, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): నిబంధనలను అతిక్రమించారంటూ నలుగురు ఉద్యోగులపై టీటీడీ చర్యలకు పూనుకుంది. ఇద్దరిని సస్పెండ్ చేయడంతో పాటు మరో ఇద్దరికి సోకాజ్ నోటీసులు జారీ చేసింది. గతేడాది అక్టోబరు 2వ తేదీన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తిరుమల పర్యటనలో ఆలయ ప్రాంగణంలో తీవ్రమైన రద్దీ పెరిగి గందరగోళం నెలకొంది. సాధారణంగా ప్రముఖుల పర్యటన నేపథ్యంలో ప్రొటోకాల్ సిబ్బంది, అర్చకులు, మేళం సిబ్బంది, అటెండర్లు, పారిశుధ్య కార్మికులకు మాత్రమే కొన్ని ప్రాంతాల్లో విధులు కేటాయిస్తారు. అయితే కొందరు ఉద్యోగులు తమకు విధులు కేటాయించకపోయినప్పటికీ పవన్‌ను కలవాలని, చూడాలనే ఉద్దేశ్యంతో ఆలయంలోకి ప్రవేశించడంతో రద్దీ ఏర్పడిందని, ఇది భద్రతకు కూడా ఇబ్బంది తీసుకొచ్చే చర్య అంటూ విజిలెన్స్ విభాగం పేర్కొంది. ఈక్రమంలో శ్రీనివాసమంగాపురంలో విధులు నిర్వహించే బాలాజీ రంగకుమార్ అనే అర్చకుడితో పాటు తిరుపతి ఈఈ కార్యాలయంలో పనిచేసే చీర్ల కిరణ్ అనే జూనియర్ అసిస్టెంట్ క్రమశిక్షణ నిబంధనలు ఉల్లఘించి డిప్యూటీ సీఎంను అనుసరించారని నివేదికలో స్పష్టం చేసింది. దీంతో ఆలయంలోకి ప్రవేశించడానికి గల కారణాలు తెలియజేయాలని ఈ ఇద్దరికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇక, తన ఇంటిని ఇతరులకు కేటాయించడంతో పాటు ఆర్థికలావాదేవీలు ఉన్నట్టు నిర్ధారణ కావడంతో ఆఫీస్ సబార్డినేట్ శంకర్‌ను, ప్రైవేట్ వ్యక్తులతో కలిసి వ్యాపారాలు నిర్వహించిన జూనియర్ అసిస్టెంట్ రామును సస్పెండ్ చేస్తూ టీటీడీ ఉత్తర్వులు జారీ చేసింది.

రైతు ప్రయోజనాల కోసం పరిశోధించాలి

- తిరుపతి ఐసర్ స్నాతకోత్సవంలో సమీర్ సోమయ్య



విద్యార్థి వినేష్ ముఖోపాధ్యాయకు గోల్డ్‌మెడల్ అందజేస్తున్న సమీర్ సోమయ్య,ఝిల్లు సింగ్ యాదవ్,శాంతను భట్టాచార్య

ఏర్పేడు, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): మట్టిలోని జీవకణాలు, కార్బన్ మీద దృష్టి తగ్గిపోతున్న క్రమంలో అన్నదాతలతో కలిసి యువ శాస్త్రవేత్తలు పనిచేయాలని గోదావరి బయోరిఫైనరీస్ లిమిటెడ్, సోమయ్య విద్యావిహార్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ సమీర్ సోమయ్య పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగానికి పరిశోధనలు ఉపకరించాలన్నారు. ఏర్పేడు సమీపంలోని ఐసర్‌లో మంగళవారం జరిగిన ఆరో స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడారు. తాము పంచగవ్య, జీవామృతం వంటి సంప్రదాయక విధానాలను పరిశీలించి, శాస్త్రీయంగా పరిశోధించి వాటిని ఆధునిక పద్ధతులతో మిళితం చేస్తున్నామన్నారు. ఈ కృషి ఫలితంగా ఉత్తర కర్ణాటకలోని ఓ రైతు సగటున 30 టన్నులకు బదులుగా 120 టన్నుల చెరకు దిగుబడి సాధించారన్నారు. తమిళనాడులో పుట్టిన మణి అనే బాలుడు మేకను విక్రయించిన డబ్బుతో చదువును సాగించాడన్నారు. ఇప్పుడు బ్రౌన్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా ఎదిగిన ఆయనతో కలిసి ప్రస్తుతం మన దేశంలోనే ఔషధ పరిశోధన కేంద్రాన్ని స్థాపిస్తున్నామని చెప్పారు. ఐసర్ బోర్డు ఆఫ్ గవర్నన్స్ చైర్‌పర్సన్ ఝిల్లు సింగ్ యాదవ్ మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యవసాయం, సస్టైనబుల్ కెమిస్ట్రీ, సెమీకండక్టర్, ఎంజైమ్ తయారీ రంగాల్లో పరిశోధనలు చేయాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్తగా రెండేళ్ల మాస్టర్ బై రీసెర్చ్(ఎంఎస్-ఆర్) కోర్సును ప్రారంభించనున్నట్టు డైరెక్టర్ శాంతను భటాచార్య వెల్లడించారు.

ఐసర్‌లో సందడిగా 'పట్టా'భిషేకం- 6లో



విజ్ఞాన దర్పణం సంస్కృత భాష

- ఒడిశా గవర్నరు కంభంపాటి హరిబాబు
- సంస్కృత వర్సిటీ భాషోత్సవ సదస్సులో పాల్గొన్న ఉత్తరాఖండ్ సీఎం

-6లో

27నుంచి కాణిపాక వరసిద్ధుడి బ్రహ్మోత్సవాలు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్నాయి. 27న వినాయక చవితితో ఉత్సవాలు ప్రారంభమవుతాయి.28న ధ్వజారోహణం ,హంస వాహన సేవ, 29న స్వర్ణ నెమలి వాహనం, 30న మూషిక వాహన సేవ, 31న స్వర్ణ శేషవాహన సేవలు, సెప్టెబరు 1న ఉదయం చిలుక వాహనం, రాత్రి వృషభ వాహన సేవ, 2న గజ వాహన సేవ, 3న రథోత్సవం, 4న తిరుకల్యాణం, అశ్వ వాహన సేవ, 5న ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. అనంతరం ప్రత్యేక ఉత్సవాలలో భాగంగా 6న అధికారనంది వాహన సేవ, 7న రావణబ్రహ్మ వాహన సేవ చంద్ర గ్రహణం కారణంగా ఉదయం నిర్వహిస్తారు. 8న యాళి వాహన సేవ, 9న సూర్య ప్రభ వాహన సేవ, 10న చంద్ర ప్రభ వాహన సేవ, 11న కల్ప వృక్ష వాహన సేవ, 12న విమానోత్సవం, 13న పుష్పపల్లకి సేవ, 14న కామధేను వాహన సేవ, 15న పూలంగి సేవ, 16న తెప్పోత్సవంతో ప్రత్యేక ఉత్సవాలు ముగుస్తాయి.

రుయాలో 40 రోజుల బిడ్డకు అతిక్లిష్టమైన శస్త్ర చికిత్స


కోలుకున్న పురిటిబిడ్డతో తల్లిదండ్రులు, సర్జరీ చేసిన వైద్యులు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కిందపడటంతో తలలో రక్తం గడ్డకట్టి పరిస్థితి విషమంగా ఉన్న 40 రోజుల పురిటి బిడ్డకు అతిక్లిష్టమైన శస్త్ర చికిత్స చేసి ప్రాణాలు నిలబెట్టామని తిరుపతిలోని రుయా చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ జయచంద్ర నాయుడు తెలిపారు. దీనిపై మంగళవారం ఆయన రుయాస్పత్రిలో అధికారులతో కలిసి మీడియాతో మాట్లాడారు. 'వెంకటగిరికి చెందిన స్వాతి, రఘు దంపతుల 40 రోజుల పాప చేతిలో నుంచి కింద పడటంతో తలకు బలమైన దెబ్బ తగిలింది. తలలో రక్తం గడ్డ కట్టింది. దీంతో మూర్ఛవ్యాధి కూడా వచ్చి పాప అపస్మారక స్థితిలోకి చేరుకుంది. వెంటనే ఆ పురిటిబిడ్డను తల్లిదండ్రులు రుయాస్పత్రిలోని చిన్నపిల్లల విభాగానికి తీసుకొచ్చారు. వైద్య పరీక్షలు నిర్వహించి నిపుణులైన న్యూరోసర్జరీ వైద్యులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ అనంతకుమార్, డాక్టర్ సుదర్శన్ అగర్వాల్, అనస్థీషియా వైద్యులు డాక్టర్ రాధ, డాక్టర్ పద్మ, డాక్టర్ శ్రీనివాసుల సాయంతో చిన్నారికి అతిక్లిష్టమైన శస్త్ర చికిత్సను నిర్వహించి చిన్నారి ప్రాణాలు నిలబెట్టారు. ప్రస్తుతం చిన్నారి పూర్తి ఆరోగ్యంగా కోలుకోవడంతో డిశ్చార్జి చేశాం' అని చెప్పారు. వైద్య బృందానికి చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఏఆర్ఎంవో హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఒకటిన్నర కిలో గంజాయి స్వాధీనం

తిరుచానూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ దామినేడు హౌసింగ్ కాలనీలో మణి, భరత్‌ను అరెస్టు చేసి ఒకటిన్నర కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. సోమవారం ఓ వివాహితపై మద్యం మత్తులో అత్యాచారానికి పాల్పడిన కార్తీక్‌కు వీరు స్నేహితులు. దీంతో ఈ హౌసింగ్‌కాలనీలో సంఘ విద్రోహశక్తులు పెరిగిపోయారు. ఫలితంగా పలు నేరసంఘటనలు జరుగుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి కార్డన్ సెర్చ్ నిర్వహించి నేరస్థులను కట్టడిచేయాలని స్థానికులు కోరుతున్నారు.


సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో ఓ షెడ్డులో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.21 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 69,928

తలనీలాలు సమర్పించినవారు : 29,297




పట్టాలు అందుకున్న విద్యార్థులు

ఐసర్‌లో సందడిగా

- 255 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం
- క్యాంపస్‌లో వెల్లివిరిసిన ఉత్సాహం

పట్టాభిషేకం


ఫొటో పాయింట్


చివరగా ఓ సెల్ఫీ

ఏర్పేడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఐసర్ ఆరో స్నాతకోత్సవం ఆనందోత్సాహాలకు వేదికైంది. మంగళవారం ఉల్లాస వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు సందడి చేశారు. పట్టాలను అందుకుంటూ పట్టరాని సంతోషాన్ని పంచుకున్నారు. కేరింతలు కొట్టారు. స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా గోదావరి బయో రిఫైనరీస్ ఛైర్మన్, విద్యా విహార్ యూనివర్శిటీ ఛాన్సలర్ సమీర్ సోమయ్య హాజరయ్యారు. ముందుగా ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య చేతుల మీదుగా 255 మంది విద్యార్థులకు డిగ్రీలను అందుకున్నారు. సమీర్ సోమయ్య, బోర్డు ఆఫ్ గవర్నర్స్ ఛైర్మన్ ఝిల్లుసింగ్ యాదవ్, ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్యలు వివిధ రంగాల్లో, విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు, రజత పతకాలను ప్రదానం చేశారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఇందర్‌ప్రీత్‌సింగ్ కోహ్లి, జాయింట్ రిజిస్ట్రార్ రమేష్, డీన్లు విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్టిల్ అదిరిపోలా..!



భావోద్వేగాల నడుమ వీడ్కోలు

తిరుపతి ఐసర్‌లో తమ చదువు ముగించి పట్టాలందుకున్న విద్యార్థులు భావోద్వేగానికి లోనయ్యారు.కొందరి కళ్లలో సన్నటి కన్నీటి పొర తొంగిచూసింది. విద్యాసంస్థను వీడిపోతున్నామనే బాధను దిగమింగుకుంటూ విద్యార్థులు పరస్పరం ఆలింగనం చేసుకున్నారు. శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఐదేళ్ల పాటు కలిసి చదువుకుని, శాస్త్రీయ పరిశోధనల్లో మేటి అనిపించుకున్న వీరంతా ఆటోగ్రాఫ్‌లు ఇచ్చుకుంటూ ఒకరికొకరు వీడ్కోలు పలికారు.

పట్టాల పండుగలో సందడి

స్నాతకోత్సవానికి 255 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, స్నేహితులు ఉత్సాహంగా హాజరయ్యారు. 22 పీహెచ్‌డీలు, 8 సమగ్ర పీహెచ్‌డీలు, 3 ఎంఎస్ డిగ్రీలు, 141 ఫ్లాగ్‌షిప్ డీఎస్ ఎంఎస్ డిగ్రీలు, 69 ప్రొఫెషనల్ మాస్టర్ డిగ్రీలు, 6 డీఎస్ డిగ్రీలు, 6 డీఎస్సీ డిగ్రీ పట్టాలను విద్యార్థులు అందుకుంటున్నప్పుడు హాలు కరతాళధ్వనులతో మారుమోగింది. కొంతమంది విద్యార్థులు డైరెక్టర్ శాంతను భట్టాచార్య, రిజిస్ట్రార్ కోహ్లీతో కలిసి ఉత్సాహం పంచుకున్నారు.


స్నాతకోత్సవానికి హాజరైన బోర్డ్ ఆఫ్ గవర్నర్ సెనేట్ కమిటీ సభ్యులు

భవిష్యత్ శాస్త్రీయశక్తిగా తిరుపతి ఐసర్

తిరుపతి ఐసర్ భవిష్యత్ శాస్త్రీయ ఆవిష్కరణలకు కేంద్రబిందువుగా మారిందని, ఐసర్ డైరెక్టర్ డాక్టర్ శాంతను భట్టాచార్య చెప్పారు. స్నాతకోత్సవాల్లో ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో జాతీయ స్థాయిలో తమ విద్యాసంస్థ శాస్త్రీయ శక్తిగా ఎదుగుతుందన్నారు ప్రత్యేకంగా తెలుగు రాష్ట్రాలకు శాస్త్రీయ దీపకాంతిగా నిలుస్తుందని ఆకాంక్షించారు. తమ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు 210 పరిశోధన పత్రాలను ప్రచురించారన్నారు. నేచర్ ఇండెక్స్-2025 ప్రకారం తిరుపతి ఐసర్ దేశంలోన్ని 33వ ర్యాంకు సాధించిందన్నారు. స్టాన్‌ఫోర్డు యూనివర్శిటీ నివేదిక ప్రకారం ప్రపంచంలో టాప్ 2 పర్శెంట్ శాస్త్రవేత్తల్లో 8మంది తిరుపతి ఐసర్ ఫ్యాకల్టీ ఉన్నారన్నారు. ఈ యేడాది నుంచి ఎంఎస్ రీసెర్చ్, డీఎస్ ఇన్ ఎకనామిక్స్, స్టాటికల్ సైన్స్(బీసీ-ఈఎస్ఎస్)కు శ్రీకారం చుట్టామన్నారు. తిరుపతి ఐసర్‌లో విద్యార్థులకు ఇంటిని మర్చిపోయే వాతావరణముందన్నారు. అత్యాధునిక సదుపాయాలు కల్పించామన్నారు. రూ.9 కోట్లతో క్రికెట్ స్టేడియాన్ని మల్టీపర్పస్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు.

బిడ్డతో హాజరైన విద్యార్థిని

కేరళకు చెందిన డోనామారియా ఐసర్‌లో ఐదేళ్లు చదివింది. స్నాతకోత్సవానికి భర్త ప్రవీణ్, రెండు నెలల చిన్నారితో కలిసి హాజరై పట్టాను అందుకుంది. ఆమెను పలువురు అభినందించారు.


అమ్మకు పట్టా..

అవార్డులు అందుకున్న వారు వీరే

తిరుపతి ఐసర్‌లో విశేషప్రతిభ కనబరిచిన కొందరు విద్యార్థులు ప్రత్యేక అవార్డులు అందుకున్నారు. డీఎస్ ఎంఎస్ ప్రోగ్రాంలో హనీఫ్ ముఖోపాధ్యాయ్(బంగారు పతకం) మ్యాథమెటిక్స్‌లో ఆర్‌సీ విష్ణు ప్రశాంత్(రజతం), డీఎస్ఎంఎస్‌లో ఆర్.విఘ్నేశ్వరన్(సిల్వర్) బీఎస్ఎంఎస్ ప్రోగ్రాంలోఆస్మా చిరుణి(బెస్ట్ గ్రాడ్యుయేటింగ్ స్టూడెంట్), అర్జిత్ శంకర్ బెనర్జీ (బెస్ట్ స్టూడెంట్ క్యాంపస్) పురస్కారాలు పొందారు.





సిల్వర్ మెడల్ అందుకుంటున్న విఘ్నేశ్వరన్, ఆర్‌సీ విష్ణుప్రశాంత్.. మరో రెండు విభాగాల్లో అవార్డు తీసుకుంటున్న టి.అస్మాషిరిన్, అర్జిత్ శంకర్ బెనర్జీ


బెస్ట్ బేబీ అవార్డు అందుకుంటున్న తల్లి నాగలక్ష్మి

తల్లిపాలతో శిశువుకు పరిపూర్ణ ఆరోగ్యం

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): నవజాతశిశువు పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు ఇవ్వడం చాలా శ్రేయస్కరమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లిపాలు బిడ్డకు ఇచ్చే తొలి టీకా అన్నారు. కనీసం ఆరు నెలల పాటు తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. ఆ తర్వాత తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారాన్ని అందించాలని సూచించారు. తల్లిపాలలో అనేక పోషకాలు బిడ్డలకు లభిస్తాయన్నారు. గర్భవతులు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతను తెలియజేయాల్సిన బాధ్యత ఆశా వర్కర్లపై కూడా ఉందన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బాలకృష్ణ, ఐసీడీఎస్ పీడీ వసంతబాయి, డీఐవో శాంతకుమరి, ప్రొఫెసర్ అరుణ, టాటాట్రస్టు మేనేజరు సుబ్రహ్మణ్యం, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా బెస్ట్ బేబీ అవార్డును తల్లి నాగలక్ష్మికి అందజేశారు.

ఆల్బెండజెల్ మాత్రలను పంపిణీ చేయండి

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు ఆల్బెండజెల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం అధికారులతో సమక్షించారు. ఆగస్టు 12న జరిగే జాతీయ డీవార్మింగ్‌డేను పురస్కరంచుకుని పిల్లలందరి ఆల్బెండజెల్ మాత్రలను పంపిణీ చేయాలన్నారు. ఆరోజు ఎవరైన లేకపోతే 20న పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ హర్షవర్ధనరాజు, జేసీ శుభం బన్సల్, కమిషనర్ మౌర్య, డీఆర్వో నరసింహులు, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ' అవినీతిలో నిర్లక్ష్యం

- ముగ్గురు సిబ్బంది సస్పెన్షన్

రామచంద్రాపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రూ.2.29లక్షల మేర అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ బహిరంగ సభలో తేలింది. అలాగే విధులు సక్రమంగా నిర్వర్తించని ముగ్గురు సిబ్బంది సస్పెండయ్యారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ బహిరంగ సభ జరిగింది. అత్యధికంగా సి.కాలేపల్లి, గంగిరెడ్డిపల్లి పంచాయతీల్లో రూ.31 వేలు అవినీతి చోటు చేసుకోగా అత్యల్పంగా సి.రామాపురంలో రూ.946 అవినీతి జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఉపాధి హామీలో అవకతవకల నేపథ్యంలో విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సాంకేతిక సహాయకులు సుదర్శన్, టెక్నికల్ ఫుట్ ఇంజనీర్ రమేష్, జూనియర్ ఇంజనీర్ మమతలను సస్పెండ్ చేసినట్లు డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్ తెలిపారు ఎంపీడీవో ఇందిరమ్మ, ఏపీడి టి చిన రెడ్డప్ప, డీఆర్‌డీఏ ఏపీడి ప్రభావతి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రభాకర్ రెడ్డి, ఏఈఈ సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

వరలక్ష్మీ వ్రతానికి విస్తృత ఏర్పాట్లు

- రేపు పద్మావతి అమ్మవారి ఆలయం వద్ద వ్రత టిక్కెట్ల విక్రయం



ముస్తాబైన ఆస్థాన మండపం.. మాడ వీధుల్లో రంగవల్లులు

తిరుచానూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పద్మావతి దేవి ఆలయంలో వైభవంగా వరలక్ష్మీ వ్రతం నిర్వహించేందుకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఈక్రమంలో ఆలయ ప్రాంగణం, మాడవీధుల్లో రంగవల్లులు, విద్యుత్ దీపాలంకరణతో శోభాయమానంగా మారాయి. వ్రత వేదిక అమ్మవారి ఆస్థాన మండపాన్ని ముస్తాబు చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పాంచరాత్ర ఆగమోక్తంగా వ్రతం జరగనుంది. సుమారు 1,100 మంది భక్తులు కూర్చునేలా ఏర్పాట్లు చేస్తున్నారు నాలుగు రోజుల క్రితమే 150 టిక్కెట్లు ఆన్‌లైన్‌లో విక్రయించారు. మిగిలిన 150 టిక్కెట్లను గురువారం ఉదయం 10గంటలకు అమ్మవారి కుంకుమార్చన కౌంటరులో విక్రయించనున్నట్లు డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్ తెలిపారు. మరో 150 టికెట్లను టీటీడీ అధికారులు విచక్షణ కోటా కింద అందజేయనున్నారు. శ్రావణ శుక్రవారం నాడు అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలిరానుండున పటిష్ట క్యూలైన్లను ఏర్పాటు చేశారు. బయట కూడా భక్తులు వ్రతాన్ని వీక్షించేందుకు ఎల్ఈడీ స్క్రీన్లు పెడుతున్నారు. పసుపుదారాలు, కుంకుమ, కంకణాలు, గాజులు, శ్రీలక్ష్మీ అష్టోత్తర శతనామావళి పుస్తకం వంటి సామగ్రిని అందించేందుకు టీటీడీ ఇప్పటికే ఏర్పాట్లు చేసింది.

విజ్ఞాన దర్పణం సంస్కృత భాష

- ఒడిశా గవర్నరు కంభంపాటి హరిబాబు
- భాషోత్సవ సదస్సులో పాల్గొన్న ఉత్తరాఖండ్ సీఎం


పుస్తకావిష్కరణలో ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామి, బాప్స్ అధ్యక్షుడు సాధు భద్రేశదాస్‌స్వామి తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): సంస్కృతభాషలో వైజ్ఞానికం దాగిఉందని ఒడిశా గవర్నరు కంభంపాటి హరిబాబు అన్నారు. రామసేతు, బ్రహ్మాస్త్రం, పాశుపతాస్త్రం తదితర నిర్మాణాలు సంస్కృతంలోని వైజ్ఞానికతని తెలియజేస్తాయన్నారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో నిర్వహించిన భాషోత్సవం జాతీయ సదస్సు ముగింపు, అక్షర పురుషోత్తమ మందిర ఆవిష్కరణ కార్యక్రమానికి ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామి, బాప్స్ అధ్యక్షుడు సాధు భద్రేశదాస్‌స్వామితో కలిసి హరిబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వర్సిటీలోని హెరిటేజ్ కారిడార్‌లో నిర్మించిన స్వామినారాయణ సంప్రదాయ అక్షర పురుషోత్తమ మందిరాన్ని వారు ఆవిష్కరించారు. జగన్నాథమందిరంలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గవర్నరు, సీఎంలకు వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఇండోర్‌స్టేడియంలో నిర్వహించిన సభాకార్యక్రమంలో గవర్నరు హరిబాబు మాట్లాడుతూ..సంస్కృతభాష మానవ జీవనాన్ని నడిపించే లివింగ్ లెగసీ అన్నారు. తనస్వగ్రామం తిమ్మసముద్రంలో సంస్కృత ఓరియంటల్ కళాశాల ఉండేదని, అక్కడ సంస్కృతాన్ని చక్కగా బోధించేవారని గుర్తుచేసుకున్నారు. సంస్కృతంలోని పాణినీయ వ్యాకరణం నేటి కంప్యూటేషనల్ లింగ్విస్టిక్స్, ఆధునిక ఏఐకి ఉపయోగకరమన్నారు.

సంస్కృతంలో భారతీయ జ్ఞానపరంపర

సీఎం పుష్కర్‌సింగ్ ధామి మాట్లాడుతూ.. భారతీయ జ్ఞానపరంపర సంస్కృతభాషలోనే నిగూఢమై ఉందన్నారు. నీతిశాస్త్రం, ధర్మశాస్త్రం, రాజనీతిశాస్త్రం తదితర సర్వవిధార్మికాంశాలు ఇందులోనే ఉన్నాయన్నారు. వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ సంస్కృతభాషాభివృద్ధికి వర్సిటీలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. అధ్యాపకులను సాధు భద్రేశదాస్‌స్వామి చేతులమీదుగా సన్మానించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కె.వెంకటనారాయణరావు, వేదవర్సిటీ వీసీ ప్రొఫెసర్ రాణీసదాశివమూర్తి, శ్రీపరమాచార్య గురుకుల కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ కె.గణపతిభట్, థింక్ ఇండియా కౌన్సిల్ మెంబర్ సౌరవ్‌పాండే, కోఆర్డినేటర్ డాక్టర్ జ్ఞానరంజన్ పండా, ఉత్తరాఖండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ వైస్ ప్రెసిడెంట్ వినయ్ కె.రుహెల్లా, డీన్లు, హెచ్‌వోడీలు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పబ్లిసిటీ కోసమే ఇదంతా..



తిరుమల భద్రతలో భాగంగానే మఠాలకు నోటీసులు ఇచ్చారు. దీనిపై భక్తులకు రాని ఇబ్బందులు వైసీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డికే వస్తున్నాయి. కేవలం పబ్లిసిటీ కోసమే ఇదంతా చేస్తున్నారు. టీటీడీలో పారదర్శక పాలనతో శ్రీవారి భక్తులకు మేలు జరుగుతుంటే ఓర్వలేక భూమన విమర్శలు చేస్తున్నారు. కుంకీ ఏనుగలతో వైల్డ్ ఎలిఫెంట్ డ్రైవ్ జరుగుతోంది. దీనిపై బుర్రలేకుండా మాట్లాడుతున్న వైసీపీ నేతలను కూడా తరిమికొట్టాలి.

- జనసేన నేత కిరణ్‌రాయల్, తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో

తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే జైలే



తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): 'తల్లిదండ్రులు, వయో వృద్ధుల సంరక్షణలో ఆయా కుటుంబాలు బాధ్యత వహించాలి. నిర్లక్ష్యం వహించే వారిపై వయోవృద్ధుల చట్ట ప్రకారం రెండు నెలల జైలు శిక్ష, లేదా రూ.5వేల జరిమానా విధిస్తారు' అని డీఆర్వో నరసింహులు తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంక్షేమ చట్టంపై వివిధ శాఖ అధికారులతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులు, పిల్లల మధ్య సఖ్యత లేని కారణంగా వివాదాలు తలెత్తుంటాయన్నారు. శ్రీమంతుల కుటుంబాల్లోనూ ఇలాంటి పరిస్థితులు చూస్తుంటామన్నారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంక్షేమ చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. తల్లిదండ్రుల సహా ఎవరైనా సీనియర్ సిటిజన్ తన సొంత సంపాదన నుంచి అతని ఆస్తి నుంచి తనుక తాను కాపాడుకోలేకపోయినపుడు ప్రాథమికంగా ఆర్డీవో అధ్యక్షతన ఉన్న ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఆర్డీవో ద్వారా సదరు వ్యక్తులకు నోటీసులు అందించి విచారిస్తారన్నారు. అప్పటికీ సమస్య సామరస్యంగా పరిష్కారం కాకుంటే.. ఆ వ్యక్తులపై చట్టపరంగా చర్యలు ఉంటాయన్నారు. ఎస్వీ యూనివర్శిటీ విశ్రాంత అసోసియట్‌ప్రొఫెసర్ ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం కోసంప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలన్నారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ వినోద్, ఐసీడీఎస్‌ప పీడీ వసంత, పాస్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి బాలకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్‌కు కరెంటు తీగలు తాకి డ్రైవరు మృతి


మృతి చెందిన చిరంజీవి

శ్రీకాళహస్తి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కంటైనర్ లారీకి కరెంటు తీగలు తాగడంతో విద్యుదాఘాతం సంభవించి డ్రైవరు చిరంజీవి(38) మృతి చెందారు. ఈ దుర్ఘటన మంగళవారం అర్ధరాత్రి శ్రీకాళహస్తి పట్టణ శివారులోని చెన్నై రహదారిపై భక్తకన్నప్ప కూడలి సమీపంలో చోటుచేసుకుంది. పిచ్చాటూరు మండలం కీలపూడికి చెందిన చిరంజీవి లారీ డ్రైవర్. ఈ క్రమంలో మంగళవారం రేణిగుంట నుంచి శ్రీసిటీకి కంటైనర్ లారీ తో బయలుదేరారు. భక్తకన్నప్ప కూడలి సమీపంలో లారీ వెళ్తుండగా పైన ఉన్న విద్యుత్ తీగలు తగులుకున్నాయి. లారీ దిగేందుకు డోరు తాకగానే ఒకసారిగా చిరంజీవి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే కుప్పకూలారు. స్థానికులు గుర్తించి శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. ప్రమాద స్థలానికి చేరుకున్న పోలీసులు చిరంజీవి మృతి చెందినట్లుగా నిర్ధారించారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వం ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

చుర్రుమంటున్న సూరీడు



నిర్మానుషంగా ఉన్న ఆర్టీసీ బస్టాండు రోడ్డు

సూళ్లూరుపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా సూరీడు ఉగ్ర రూపాన్ని చూపిస్తున్నాడు. రోజు రోజుకు ఎండలు మండిపోతున్నాయి. ఇంటా బయటా ఎండ వేడిమిని తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 8నుంచి సాయంత్రం 5 గంటల వరకు భానుడు మండిపోతున్నాడు. వర్షాకాలంలో వేసవికి మించి ఎండలు వడగాడ్పులతో కూడిన ఎండ కాస్తుండడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నారు. వద్ధులు, చంటి పిల్లలు ఉక్కపోత తట్టుకోలేక తల్లడిల్లిపోతున్నారు. నిత్యం జన సంచారంతో రద్దీగా ఉండే ప్రధాన రోడ్లు నిర్మానుషంగా మారిపోతున్నాయి. మరో పక్క తరచూ విద్యుత్ కోతలు విధిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ మురళీకృష్ణ, పక్కన ఎస్ఐలు బ్రహ్మ నాయుడు, స్వప్న

సూళ్లూరుపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులపై వేధింపులు, మహిళల భద్రత, సైబర్ మోసాలపై స్థానిక ప్రతిభ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాల గురించి తెలుసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. మహిళ భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక యాప్ తీసుకొచ్చిందని, మహిళలు, విద్యార్థులు ఎవరైనా వేధింపులకు గురైన వెంటనే ఈ యాప్ ద్వారా పోలీసులకు సమాచారం అందించవచ్చన్నారు. అదేవిధంగా మండల పరిధిలోని మంగళంపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట, శ్రీహరికోట ఎస్ఐలు బ్రహ్మనాయుడు, స్వప్న, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐతో పారదర్శకంగా ఉపాధి మస్టర్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ వరప్రసాద్‌రావు

గూడూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో అవకతవకలను నియంత్రించి పారదర్శకంగా మస్టర్లను రూపొందించేందుకు ఏఐ ఆధారిత విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు డ్వామా ఏపీడీ వరప్రసాద్‌రావు తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మస్టర్లలో అవకతవకలను నివారించేందుకు నేషనల్ మస్టర్ మానటరింగ్ సిస్టమ్ ఆధ్వర్యంలో ముఖ ఆధారిత హాజరు విధానాన్ని అమల్లోకి తెచ్చినా కొన్ని చోట్ల అవకతవకలు జరుగుతున్నాయన్నారు. వీటిని నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈనెల 10 నుంచి ఏఐ ఆధారిత ముఖ ఆధారిత హాజరు విధానాన్ని ప్రవేశపెట్టనుందన్నారు. ఈ విధానంలో భాగంగా అప్‌లోడ్ చేసిన ఫొటోలో ఎంత మంది పనులు చేస్తున్నారో గుర్తించి మస్టర్లు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీవో పెంచలయ్య, కాంచన పాల్గొన్నారు.

ఆర్ముగం రాజరాజన్‌కు ఘనంగా వీడ్కోలు



రాజరాజన్ దంపతులను సన్మానిస్తున్న షార్ డైరెక్టర్ పద్మకుమార్, కంట్రోలర్ శ్రీనివాసులు రెడ్డి తదితరులు

సూళ్లూరుపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): షార్ డైరెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్‌సీ)కు వెళ్లిన ఆర్ముగం రాజరాజన్‌కు మంగళవారం షార్‌లోని ఎంఆర్ కురుప్ ఆడిటోరియంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ప్రస్తుత షార్ డైరెక్టర్ డాక్టర్ వీఎస్ పద్మకుమార్, కంట్రోలర్ ఎం.శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఆర్ముగం రాజరాజన్‌ను ఘనంగా సన్మానించా, ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పి డిప్యూటీ డైరెక్టర్ గోపికృష్ణ, పలువురు షార్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించండి



మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు

పెళ్లకూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రకృతి విపత్తుల కారణంగా పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందించారు. అమరావతిలో మంత్రిని కలసి రైతుల సమస్యలను వివరించారు. గతేడాది సంభవించిన తుఫాను దెబ్బకు జిల్లాలో 33 శాతం వరి పంట దెబ్బతిందని, రైతులకు పరిహారం చెల్లించడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి పాదర్తి రాజారెడ్డి, నాయకులు మహేశ్వర్‌రెడ్డి, ఆశాకిరణ్, ఇండ్ల శశికిరణ్ ఉన్నారు.

12న ఓజిలి మండల సమావేశం

ఓజిలి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండల సర్వసభ్య సమావేశం ఈనెల 12వ తేదీన ఎంపీపీ గడ్డం అరుణమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

విద్యాసామగ్రి అందజేత

తడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వేనాడు మోడల్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు సూళ్లూరుపేటకు చెందిన ఆచార్య భరద్వాజా సేవాసంస్థ ఆధ్వర్యంలో మంగళవారం విద్యాసామగ్రిని అందజేశారు. పాఠశాలలోని 70 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు, ప్యాడ్‌లు, పెన్సిళ్లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఎంఎం చంద్రబాబు, అశోక్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు మమత పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేరుస్తూ ప్రజాదరణ పొందుతున్నాం: పాశం



సిమెంట్ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

కోట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో గ్రామాల్లో అంచలంచెలుగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని రుద్రవరం, గూడలి పంచాయతీలోని చంద్రశేఖరపురం గ్రామాల్లో మంగళవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ఇంటింటా తిరిగి కూటమి పాలనలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లోని మహిళలు అడుగడుగున హారతులు ఇస్తూ స్వాగతం పలికారు. రుద్రవరంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ కవిత ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఎమ్మెల్యే సారె అందజేసి ఆశీర్వదించారు. అదేవిధంగా చంద్రశేఖరపురంలో సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తూ ప్రజాదరణ పొందుతున్నామన్నారు. వైసీపీ నాయకులు కళ్లుమూసుకొని అసత్య ఆరోపణలు చేస్తున్నారని, కళ్లు తెరచిచూస్తే అభివృద్ధి కళ్లకు కనిపిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పలగాటి సంపత్ కుమార్‌రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, మాజీ ఎంపీపీ నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుమలశెట్టి కోటేశ్వరరావు, మోహన్‌రెడ్డి, మధుయాదవ్, మైనార్టీ సెల్ నాయకులు మస్తాన్‌బాషా, చోటా సాహెబ్, యల్లశిరి కృష్ణయ్య, శ్రీనివాసులు, ముత్యాలయ్య, వెంకట కృష్ణారెడ్డి, రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: కురుగొండ్ల



బైరవరంలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

బాలాయపల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని బైరవరం గ్రామంలో సుపరిపాలనలో తొలి అగుడు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అమ్మఒడి కుటుంబంలో ఒక్కరికే ఇచ్చేవారని, కూటమి ప్రభుత్వం కుటుంబంలో ఎంతమంది పిల్లలు చదువుకుంటుంటే అందరికీ తల్లికి వందనం వర్తింపజేయడం జరుగుతోందన్నారు. సూపర్ సిక్స్ పథకాల హామీల అమలుతో ప్రతికుటుంబం సంతోషంగా ఉందన్నారు. గ్రామంలో రోడ్లు నిర్మించాలని స్థానికులు కోరగా, అన్ని ప్రాంతాలను కలుపుతూ లింకు రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుం టామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, నాయకులు రాయి సత్యం నాయుడు, దాసరి రాజగోపాల్ నాయుడు, దాసరి ప్రభాకర్ నాయుడు, శింగంశెట్టి భాస్కర్ రావు, కూను శ్రీహరి, తాళ్లూరు ప్రసాద్ నాయుడు, నల్లబోతుల మురళి, చిత్తూరు ఈశ్వరయ్య, సీసీ నాయుడు, ఎంపీటీసీ వేళ్ల సురేంద్ర రెడ్డి, దాసరి కోటేశ్వరావు, దాసరి పెంచలయ్య, దాసరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వార్డులో సమస్యల పరిష్కరించేందుకు చర్యలు

వెంకటగిరి: వార్డులో సమస్యలన్నింటినీ విడతలవారీగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చెప్పారు. మంగళవారం పట్టణ పరిధిలోని 17వ వార్డు కలివేలమ్మగుడి వీధిలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. వార్డులో తాగునీరు, డ్రైనేజ్ సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రావడంతో స్పందించిన ఆయన విడతల వారీగా పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, నాయకులు మంకు ఆనంద్, అవ్వారు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాట్సప్ గవర్నెన్స్‌పై అవగాహన



ర్యాలీ కరపత్రాలతో మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, తహసీల్దార్ గోపినాథరెడ్డి, ఎంపీడీవో మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మ నాయుడు

సూళ్లూరుపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ప్రభుత్వం అందించే వివిధ రకాల సేవలను కార్యాలయాలకు వెళ్లకుండా ఇంటి నుంచే పొందేందుకు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన వాట్సప్ గవర్నెన్స్ సేవలపై మంగళవారం సూళ్లూరుపేట పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు నిర్వహించిన ర్యాలీలో వాట్సప్ గవర్నెన్స్ సేవలు, ఉపయోగాలను వివరించే కరపత్రాల ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, తహసీల్దార్ గోపినాథరెడ్డి, ఎంపీడీవో మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మ నాయుడు, ఆర్ఐ రాజగోపాల్, రెవెన్యూ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల చేతిలో ప్రభుత్వం



ర్యాలీ నిర్వహిస్తున్న కమిషనర్ ఫజులుల్లా, తదితరులు

నాయుడుపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వాట్సాప్ గవర్నెన్స్‌తో ప్రజల చేతుల్లోకే ప్రభుత్వం వచ్చిందని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా అన్నారు. వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పట్టణంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. వాట్సాప్ నెంబరు 9552300009కు ఒక్క మిస్‌కాల్ ఇస్తే వివిధ శాఖల్లో 200 పైగా సేవలు పొందవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయాలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి సన్మానం



సచివాలయ సిబ్బందిని సన్మానిస్తున్న ఉప సర్పంచ్ సుబ్బారావు

ఓజిలి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఓజిలి సచివాయలంలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన సిబ్బందికి ఉప సర్పంచ్ ముమ్మడి సుబ్బారావు ఆధ్వర్యంలో మంగళవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. డిజిటల్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసూన, అగ్రికల్చర్ అసిస్టెంట్ భావన, మహిళా పోలీసు వెంకటరమణమ్మకు శాలువాలు కప్పి సత్కరించారు. బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ టైపిస్ట్ రవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

నాయుడుపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత బీడీకాలనీ, కొత్త బీడీకాలనీ, లోతువానిగుంట ప్రాంతాల్లో రెండు రోజులుగా నీటి సరఫరా ఆగిపోయింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక పోలేరమ్మ గుడి వద్ద ఉన్న రిగ్ బోరు నుంచి నీళ్లు తెచ్చుకుని వినియోగించుకుంటున్నారు. లోతువానిగుంట ప్రాంతంలో బోరు మోటరు కాలిపోవడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని, మరమ్మతులు చేసి సమస్య పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా చెప్పారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో మంగళవారం రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్‌వీల్‌క్లబ్, ఆంధ్రమహిళా మండలి సహకారంతో దివ్యాంగులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రోహిణి, విజయ, మాధురి, లక్ష్మి, స్నేహలత, వెంకటేశ్వర్లు, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

ఘర్షణలో ఒకరికి గాయాలు

కోట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కోట మండలం కేశవరం పంచాయతీ పరిధిలోని రాఘవాపురంలో ఇద్దరి మధ్య మంగళవారం రాత్రి ఘర్షణ జరిగింది. గ్రామానికి చెందిన రహీముల్లా అదే గ్రామానికి చెందిన అనిల్‌కు కొంత నగదును అప్పుగా ఇచ్చాడు. బాకీ చెల్లించే విషయంలో ఇద్దరి మధ్య వివాదం చోటు చేసుకుంది. మంగళవారం బాకీ విషయమై అనిల్‌ను రహీముల్లాను నిలదీశాడు. దీంతో అనిల్, శ్రీనివాసులు కలిసి ఇంట్లో ఉన్న రహీముల్లాపై దాడి చేశారు. రాయితో బలంగా కొట్టడంతో రహీముల్లా తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కోట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి



విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రోహిణి

గూడూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు వ్యక్తిగత శుభ్రత పాటించి ఆరోగ్యంగా ఉండాలని డాక్టర్ రోహిణి అన్నారు. మంగళవారం స్థానిక గాంధీనగర్ సమీపంలోని మినీ గురుకులంలో రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎస్వీరత్నం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీకంటి రామమోహన్‌రావు దాతృత్వంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, శ్రీకంటి రామమోహన్‌రావు, రాజ్యలక్ష్మి, విజయ భాస్కర్‌రెడ్డి, రాఘవరెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, నాశిన నాగులు, సనత్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, నవీన్‌జయకుమార్, మేరీ, డాక్టర్లు సత్యశ్రీ, నారాయణ, కీర్తి, త్రివిక్రమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆపాలి

గూడూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం ఆపాలని సీపీఎం నాయకులు అన్నారు. మంగళవారం స్థానిక శాంతినగర్‌లోని సచివాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం వల్ల విద్యుత్‌బిల్లుల భారం అధికమవుతుందన్నారు. ఈనెల 11న స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా వామపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శివకుమార్, వెంకట్రామిరెడ్డి, చంద్రయ్య, ప్రసాద్, శంకరయ్య, మధు, మణి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వద్దు

డక్కిలి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిరసిస్తూ డక్కిలి సబ్‌స్టేషన్ వద్ద రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. గౌతమ్ అదానీకి లబ్ధి చేకూర్చేందుకే స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు పెనమాల నారాయణ, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలి

వెంకటగిరి టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌మీటర్ల వల్ల విద్యుత్ చార్జీలు ప్రజలకు భారంగా మారుతున్నాయని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమణయ్య అన్నారు. మంగళవారం స్థానిక పాలకేంద్రం వద్ద ఉన్న సబ్‌స్టేషన్ ఎదుట రైతులతో కలిసి ధర్నా చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుబ్బ రాయుడు, కృష్ణారెడ్డి, చిన్న ఓబయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేష్ఠం

వెంకటగిరి టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బిడ్డకు ముర్రుపాలు రోగనిరోధక శక్తి పెంచుతాయని సీడీపీవో షంషాద్‌బేగం అన్నారు. మంగళవారం స్థానిక తిమ్మాయగుంట గ్రామంలో తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మి, కుసుమ, లీల, సుప్రియ, చెంచులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలతో వ్యాధి నిరోధకశక్తి

నాయుడుపేట టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): బిడ్డలకు ముర్రుపాలు ఇవ్వడం వల్ల వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ హేమలత అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా నాయుడుపేట మండలం చలివేంద్రలో ఐసీడీఎస్ సిబ్బంది ర్యాలీ నిర్వహించి గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో లభ్యమయ్యే పాలు, గుడ్లు, పెరుగు, వేరుశనగ ముద్దలు, ఆకుకూరలు, చిరుధాన్యాలు, బెల్లం, ఖర్జూరం, జామకాయ వంటి వాటిల్లో మంచి పౌష్టికాహారం ఉంటుందన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



మున్నెయ్య (ఫైల్‌ఫొటో)

పెళ్లకూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిమాల గ్రామంలో విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పేరువాయి మున్నెయ్య(50) మంగళవారం ఉదయం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్ అమర్చుతుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పశువుల కాపరి చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహానికి నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటి గుంటలో పడి...



చంద్రబాబు(ఫైల్‌ఫొటో)

వాకాడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు గ్రామం సమీపంలోని శివాలయం వద్ద ఉన్న నీటి గుంటలోపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ నాగబాబు తెలిపిన వివరాల మేరకు... నాయుడుపేట మండలం వేముగుంట పాళెం గ్రామానికి చెందిన చంద్రబాబు(42) వాకాడు మండలంలోని కల్లూరులో వివాహం చేసుకుని, అదే గ్రామంలో నివాసం ఉంటున్నాడు. మంగళవారం గ్రామానికి సమీపంలోని నీటిగుంటలో మృతదేహం తేలియాడుతుండగా గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించారు.

రైల్వేస్టేషన్ ఆవరణలో...

గూడూరు అర్బన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో మంగళవారం ఓ యువకుడు మృతిచెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఒకటో పట్టణ ఎస్ఐ తిరుపతయ్య వివరాల మేరకు.. అస్సాం రాష్ట్రం డింగ్‌డింగా గ్రామానికి చెందిన రూపక్‌రాయ్(23) మంగళవారం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం నుంచి బయటకు వస్తుండగా ఆర్పీ వద్ద కూర్చొని సొమ్మసిల్లిపోయాడు. స్థానికులు గమనించి 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూసేసరికి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతుడి వద్ద లభ్యమైన ఆధార్ కార్డుతో అస్సాంవాసిగా గుర్తించారు. అతని పర్సులో లభ్యమైన ఫోన్ నంబరుకు కాల్ చేసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా, రూపక్‌రాయ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడని, పరిస్థితి విషమించి మృతి చెంది ఉంటాడని చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అభివృద్ధికి నిధులు కేటాయించండి
సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే విజయశ్రీ విజ్ఞప్తి



సీఎం చంద్రబాబుతో విజయశ్రీ

తడ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు మరిన్ని నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కోరారు. మంగళవారం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును ఎమ్మెల్యే విజయశ్రీ కలిశారు. స్వర్ణముఖి, కాలంగి నదుల వంతెనలు శిథిలావస్థలో ఉన్నాయని, వాటికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే కాళంగి గ్రాయిన్, పెళ్లకూరు మండలం చెంబేడు మినీ రిజర్వాయర్ పనులకు ఆర్థికశాఖ నుంచి, అనుమతులు లభించేలా చర్యలు తీసుకోవాలని అలాగే కొరిడి - పేర్నాడు బీటీ రోడ్డు, మీజూరు చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలకు అటవీ అనుమతులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి వివరించారు. ఆ మేరకు వినతిపత్రం అందజేశారు. ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే చెప్పారు.

అండర్ బ్రిడ్జి నిర్మించండి



పీడీ ఎంకే చౌదరికి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

చిల్లకూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉడతావారిపార్లపల్లి సమీపంలోని సాగరమాల రోడ్డుపై అండర్ బ్రిడ్జిని నిర్మించాలని కోరుతూ మంగళవారం నెల్లూరులోని జాతీయ రహదారుల సంస్థ పీడీ ఎంకే చౌదరికి సర్పంచు త్రివిక్రమ్‌భూపతి, టీడీపీ నాయకులు మేకల కుమార్, భాస్కర్ వినతిప్రతం అందజేసిశారు. తమ గ్రామ సమీపంలో సాగరమాల రోడ్డుపై అండర్ బ్రిడ్జి నిర్మించకపోతే విద్యార్థులు, రైతులు, సమీపంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్రఇబ్బందులు పడాల్సి వుంటుందన్నారు. విద్యార్థులు, రైతులు, స్థానికుల సౌకర్యార్థం అండర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు.